Sweken IT Solutions
WE ARE HIRING !!
POWER BI SPECIALIST
DATA ANALYST
INTERESTED CANDITATES PLEASE SEND YOUR RESUME TO MAIL: careers@sweken.com PH: 9100986585

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

RNI No.52722/90 సంపుటి : 35 సంచిక : 211 విశాఖపట్నం, 5 జూన్ 2025 గురువారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

విలేఖరులు కావలెను
విశాఖపట్నం, విజయనగరం, పార్వతీపురం, శ్రీకాకుళంలో అన్ని జిల్లాలకు విలేఖరులు కావలెను.
మేనేజర్
విశాఖ సమాచారమ్
సెల్ : 7013785256, 9959867303

## జులై 21 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

### కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు వెల్లడి



**డిల్లీ:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తేదీని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆపరేషన్ సిందూర్‌పై సమావేశాల కోసం విపక్షాలు పట్టుపడుతున్న వేళ ఈ ప్రకటన వెలువడింది.

జులై 21 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు బుధవారం ప్రకటించారు. ఆ రోజు ఉదయం 11లకు రాజ్యసభ, లోక్‌సభ సమావేశమవుతాయని వెల్లడించారు. ఈ సమావేశ తేదీలను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని పార్లమెంట్ వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు.

ఓ పక్క విపక్షాలు ఆపరేషన్ సిందూర్, పహల్గాం ఉగ్రదాడిపై పార్లమెంట్‌ను ప్రత్యేకంగా సమావేశ పర్చాలని డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రిజిజు స్పందిస్తూ.. వర్షాకాల సమావేశాల్లో అన్ని అంశాలను పార్లమెంట్ నిబంధనల ప్రకారం చర్చిస్తామని చెప్పారు.

ఇక ఆపరేషన్ సిందూర్ తదితర అంశాలపై చర్చించేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని మంగళవారం ఇండియా కూటమికి చెందిన 16 ప్రతిపక్ష

(మిగతా 2లో)

## బియ్యం వద్దంటే.. ఇతర సరకులు!

✦ రాష్ట్ర ప్రభుత్వం యోచన ✦ ప్రస్తుతం కిలో రేషన్ బియ్యానికి రూ.46 ఖర్చు ✦ 70 శాతం కార్డుదారులు డీలర్లకే అమ్ముకుంటున్న వైనం ✦ వారికి వచ్చేది కిలోకు రూ.10 నుంచి రూ.11కే



**అమరావతి, (విశాఖ సమాచారమ్):–** రేషన్ బియ్యం వద్దన్న వారికి..ఆ మొత్తానికి సరిపడా ఇతర నిత్యావసరాలు ఇచ్చే ఆలోచన ప్రభుత్వం చేస్తోంది. ఈ విధానం అమలుపై పౌరసరఫరాలశాఖ ద్వారా అధ్యయనం చేయిస్తోంది. బియ్యం వద్దన్న వారికి నగదు ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు జూన్ 1న కోనసీమ జిల్లా పర్యటన సందర్భంగా ప్రకటించారు. గత నెలలో జరిగిన మంత్రివర్గ సమావేశంలోనూ బియ్యానికి బదులు నగదు పంపిణీ అంశం చర్చకు వచ్చింది. కార్డుదారుల అభిప్రాయాలు సేకరించి.. అమలు చేయాలనే అభిప్రాయం వ్యక్తమైంది. రేషన్ బియ్యంపై కిలోకు రూ.46 చొప్పున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చు పెడుతున్నాయి. అయితే అధికశాతం కుటుంబాలు బియ్యాన్ని తీసుకుని కిలో రూ.10 నుంచి రూ.11కు అమ్ముకుంటున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్య సేవలు, ఇతర ప్రయోజనాల కోసమే రేషన్ కార్డును ఉపయోగించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో బియ్యానికి బదులుగా ఆ మొత్తానికి సరిపడా ఇతర నిత్యావసరాలు అందించే విధానంపై కసరత్తు చేస్తోంది.

**'పేద'కు ప్రామాణికం రేషన్‌కార్డే.. అందుకే డిమాండ్**

పేదరికానికి రేషన్‌కార్డే ప్రామాణికం.. కార్డు ఉంటేనే ఇతర ప్రభుత్వ పథకాలకు అర్హత కల్పిస్తున్నారు. అందుకే అధికశాతం కుటుంబాలు బియ్యం అవసరం లేకున్నా రేషన్‌కార్డులు తీసుకుంటున్నాయి. రేషన్ కార్డుతో సంబంధం లేకుండానే.. నిజమైన పేదలను గుర్తించి సంక్షేమ పథకాలు, ఇతర ప్రయోజనాలు అందించాలని గతంలో నిర్ణయించిన ప్రభుత్వం.. బియ్యం కార్డుగా పేరు మార్చింది. అయినా ప్రభుత్వశాఖలు మాత్రం అర్హుల ఎంపికకు ఆరు అంచెల వడపోత (సిక్స్ స్టెప్ వ్యాలిడేషన్) అమలు చేస్తూ.. బియ్యం కార్డును ప్రామాణికంగా తీసుకుంటున్నాయి. ఫలితంగా పేరు మారినా బియ్యం కార్డుకు డిమాండు తగ్గలేదు.

**30 శాతం కుటుంబాలకు రేషన్ బియ్యమే ఆధారం**

రాష్ట్రంలో 1.46 కోట్ల రేషన్ కార్డులున్నాయి. వీరిలో 30శాతం కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చే రేషన్ బియ్యమే ఆధారం. అంటే సుమారు 44 లక్షల మందికి ప్రభుత్వం ఇచ్చే బియ్యం ఎంతో అవసరం. మిగిలిన 70% మంది అవసరం లేకున్నా.. బియ్యం కార్డును నిలబెట్టుకునేందుకు నెల నెలా ఉచిత బియ్యం తీసుకుంటున్నారు. వాటిని ఎండీయూ వాహనదారులు కిలో రూ.10 నుంచి రూ.11 చొప్పున కొని నల్లబజారుకు తరలిస్తున్నారని ప్రభుత్వ పరిశీలనలో తేలింది. ఇదొక మాఫియాగా తయారైంది.

**ఒక్కో కుటుంబంపై రూ.920**

ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యాన్ని కొని మిల్లింగ్ చేయించి.. వచ్చిన బియ్యాన్ని పేదలకు పంపిణీ చేస్తోంది. ధాన్యం కొనుగోలుతోపాటు రవాణా, అన్ని రకాల ఖర్చులు, కమీషన్ కలిపి కిలో బియ్యానికి రూ.46 ఖర్చు అవుతోంది. రాష్ట్రంలో 1.46 కోట్ల కార్డుల్లో 90 లక్షల కార్డుదారులకు మాత్రమే కేంద్రం ఉచిత బియ్యం అందిస్తోంది. మిగిలిన 56 లక్షల కార్డుదారులకు రాష్ట్రమే సొంతంగా రూ.6,193 కోట్లు భరిస్తోంది.

నలుగురు సభ్యులున్న కుటుంబానికి 20 కిలోల బియ్యం ఇచ్చేందుకు ప్రభుత్వానికి రూ.920

(మిగతా 2లో)

## మంత్రులు దూకుడు పెంచాలి

- జనంతో మమేకం కావాలి
- క్యాబినెట్ మీటింగ్‌లో సీఎం చంద్రబాబు దిశానిర్దేశం
- పలు కీలక నిర్ణయాలకు ఆమోదం



**అమరావతి, (విశాఖ సమాచారమ్):–** ఏడాది కూటమి పరిపాలన అంతా బాగుందని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు సంతృప్తి వ్యక్తంచేశారు. మంత్రులు మరింత సమర్థంగా పనిచేయాలని సూచించారు. ప్రజాసమస్యల పరిష్కారమే అజెండా కావాలని పిలుపునిచ్చారు. ఏపీ సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన బుధవారం క్యాబినెట్ సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ఎన్డీయే కూటమిని ఆశీర్వదిస్తూ ప్రజలు తీర్పు ఇచ్చి ఏడాదైన సందర్భంగా ప్రభుత్వం అందించిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రివర్గ సమావేశంలో చర్చ జరిగింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేశామని మంత్రులు అభిప్రాయపడ్డారు. అనంతరం బల్లలు చరుస్తూ సీఎంకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, మరింత దూకుడు పెంచి ప్రజల్లో మమేకం కావాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో ప్రమాదకర రాజకీయాలు నడుస్తున్నాయని అన్నారు. ఒకప్పుడు నేరస్థుల్ని రాజకీయ నాయకులు కలవాలంటేనే భయపడేవారన్న చంద్రబాబు.. ఇప్పుడు నేరస్థుల్ని అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. నేరస్థులకు తాము అండగా ఉన్నామని ప్రజలకు సందేశమిస్తూ రాజకీయాల్ని ఎటు తీసుకుపోతున్నారో అర్థం కావట్లేదని దుయ్యబట్టారు. గత ప్రభుత్వంలో తప్పులు చేసిన పెద్దలు ఇంకా బయటే తిరగటం సబబు కాదని పలువురు మంత్రులు అభిప్రాయపడ్డారు. ఏ తప్పూ చేయకుండానే తెలుగుదేశం నాయకుల్ని గత ప్రభుత్వంలో జైలుకు పంపారని మంత్రి సంధ్యారాణి గుర్తు చేశారు. గత ప్రభుత్వ అవినీతి, అక్రమాలపై పారదర్శకంగా విచారణ జరుపుతామని, నేరం రుజువైతే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని చంద్రబాబు అన్నారు. పోలవరం –బనకచర్లపై కేంద్రం నుంచి సానుకూల స్పందన వస్తోందని, ప్రాజెక్టుకు నిధుల సమీకరణ జరుగుతోందని సీఎం తెలిపారు.

**క్యాబినెట్ నిర్ణయాలివే..**

**సీఆర్డీఏ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు క్యాబినెట్ ఆమోదం**

(మిగతా 2లో)

## ప్రజలను మోసంచేసినందుకే వెన్నుపోటు దినం

### వైఎస్ జగన్ ట్వీట్



**తాడేపల్లి, (విశాఖ సమాచారమ్):–** 'వెన్నుపోటు దినం' సక్సెస్‌పై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ట్వీట్ చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. "సంవత్సరం క్రితం చంద్రబాబు అధికారంలోకి వచ్చారు.. కానీ ఇప్పటి వరకు ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని కానీ, హామీని కానీ అమలు చేయలేదు. తనను నమ్మిన రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు ద్రోహం చేశారు" అంటూ వైఎస్ జగన్ ఎక్స్ వేదికగా నిలదీశారు. "ఎన్నో హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచారు. అందుకే ఈరోజు వెన్నుపోటు దినం కార్యక్రమానికి పిలుపునిచ్చాం. అన్ని వర్గాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ

(మిగతా 2లో)

## 2027లో జనగణన: కేంద్రం వెల్లడి



**దిల్లీ:** దేశవ్యాప్త జనగణన ఎప్పుడు నిర్వహిస్తారోనన్న ఎదురుచూపులకు తెర పడే సమయం ఆసన్నమైంది. జనగణనకు కేంద్రం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. 2027 మార్చి 1 నుంచి జనాభా లెక్కింపు జరగనుందని కేంద్ర అధికార వర్గాలు వెల్లడించాయి. దీంతో పాటు కుల గణన కూడా నిర్వహించనున్నట్లు తెలిపాయి.

**రెండు దశల్లో లెక్కింపు..**

హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కశ్మీర్, ఉత్తరఖండ్, లద్దాఖ్‌లతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాల్లో మాత్రం 2026 అక్టోబర్ ప్రారంభంలోనే లెక్కింపు మొదలుపెట్టే అవకాశం ఉందని పేర్కొన్నాయి. ఈ జనాభా గణన రెండు దశల్లో నిర్వహించనున్నారు. మహిళలు, పురుషుల లెక్కింపుతో పాటు కులం, ఉపకులాలను లెక్కించి జాబితా రూపొందించనున్నారు. కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలోని 'రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ ఆఫ్ ఇండియా' పర్యవేక్షణలో జనాభా లెక్కలు నిర్వహిస్తారు.

సాధారణంగా పదేళ్లకోసారి జనాభా లెక్కలు నిర్వహిస్తారు. చివరి సారి 2011లో దీన్ని నిర్వహించారు. 2021 జనాభా లెక్కలకు సంబంధించి 2020లోనే ఈ ప్రక్రియ చేపట్టాల్సింది. కానీ.. కొవిడ్ కారణంగా వాయిదా పడింది. ఎప్పుడు నిర్వహిస్తారనేదాని పైనా స్పష్టత లేకుండా పోయింది. సరైన సమయంలో నిర్వహిస్తామని 2024లో ఓ సందర్భంలో కేంద్ర మంత్రి అమిత్ షా తెలిపారు. 16 ఏళ్ల తర్వాత తొలిసారి జనాభా గణన నిర్వహించనున్నారు. ఇప్పటికే జనాభా లెక్కల వివరాల నమోదుకు సంబంధించి 30కిపైగా ప్రశ్నలను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

## మేనిఫెస్టో అమలుపై చర్చకు సిద్ధమా?

### వైసీపీకి గంటా సవాల్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** మేనిఫెస్టో హామీల అమలుపై జర్నలిస్టుల సమక్షంలో చర్చకు సిద్ధమని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వైసీపీకి సవాల్ విసిరారు. ఎం.వి.పి. కాలనీలోని నివాసంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల హామీలను అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని.. హామీలను అమలు చేయకుండా ప్రజలను వంచించిన జగన్మోహన్ రెడ్డి తప్పుపట్టడం విడ్డూరంగా ఉందన్నారు. 2019 మేనిఫెస్టోలో చెప్పిన మద్య నిషేధం, ప్రతి ఏటా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ వంటి అనేక హామీలు అమలు చేయకుండా అయిదేళ్లు గడిపేశారని, 2024 లో 11 సీట్లకు పరిమితం చేస్తూ ఇచ్చిన ఫలితంతో జగన్ మైండ్ బ్లాంక్ అయ్యి ప్రజల తీర్పు సైతం అపహాస్యం చేసేలా దిగజారి మాట్లాడుతున్నారని అన్నారు. బ్లాంక్ అయిన మైండ్ ను సెట్ చేసుకుని జనం మధ్యలోకి వచ్చేలా చేయాలని దేవుడిని కోరుకుంటున్నానని చెప్పారు. బాధ్యత

(మిగతా 2లో)

## కమల్‌హాసన్ రాజ్యసభ నామినేషన్ వాయిదా

### భాషా వివాద నేపథ్యం..



మక్కల్ నీది మయ్యం (ఎంఎన్‌ఎం) పార్టీ అధ్యక్షుడు కమల్‌హాసన్‌కు రాజ్యసభ స్థానానికి వేయాల్సిన నామినేషన్‌ను వాయిదా వేసుకున్నారు.

'థగ్ లైఫ్' సినిమా ఈవెంట్‌లో కన్నడ భాషపై ఎంఎన్‌ఎం అధినేత, ప్రముఖ నటుడు కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగిన సంగతి తెలిసిందే. ఈ భాషా వివాదం నేపథ్యంలో ఆయన రాజ్యసభ స్థానానికి నామినేషన్ దాఖలు చేయడాన్ని వాయిదా వేసుకున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. త్వరలో విడుదల కాబోయే

(మిగతా 2లో)

## డీఎస్సీ పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

◉ అధికారులతో జేసీ మయూర్ అశోక్ సమీక్ష ◉ జిల్లాలో రేపటి నుంచి 12 కేంద్రాల్లో పరీక్షలు ◉ హాజరుకానున్న 57,895 మంది అభ్యర్థులు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** ఈ నెల 6 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న డీఎస్సీ పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని, పక్కా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ ఆదేశించారు. ఈ మేరకు బుధవారం తన ఛాంబర్లో ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. జిల్లాలో 12 కేంద్రాల్లో పరీక్షల జరగనున్న నేపథ్యంలో సమన్వయం వహించాలని, ఎక్కడా చిన్నపాటి లోపం కూడా తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. జూన్ 6 నుంచి 30వ తేదీ వరకు డీఎస్సీ షెడ్యూల్ ఉంటుందని, సుమారు 57,895 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.

జిల్లాలో కొమ్మాది చైతన్య ఇంజనీరింగ్ కాలేజ్, పెద గంట్యాడ ఎస్.వి.ఎస్. సొల్యూషన్స్, షీలా నగర్, చినముషిడివాడ–1, 2 ఐయాన్ డిజిటల్ సెంటర్లు, ఎన్‌ఎస్టీఎల్ సమీపంలోని ఏడీజడ్ ఆర్వోనా డిజిటల్, మధురువాడ, రుషికొండ గాయిత్రీ విద్యా పరిషత్, దువ్వాడ విజ్ఞాన్, కాపు జగ్గరాజుపేట విజ్ఞాన్, శొంఠ్యాం ఎన్.ఎస్.ఆర్.ఐ.టి., నర్వా విట్స్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఆన్‌లైన్ విధానంలో ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటలు వరకు రెండు పూటలా పరీక్ష జరుగుతుందన్నారు. అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి గంట ముందుగా హాజరుకావాలని, హాల్ టిక్కెట్‌తో పాటు తప్పనిసరిగా ఆధార్ లేదా ఏదైనా గుర్తింపు కార్డును తీసుకురావాలని సూచించారు.

పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలని జేసీ ఆదేశించారు. ప్రతీ పరీక్షా కేంద్రానికి ఒక ఛీఫ్ సూపరింటెండెంట్, సిట్టింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని పరీక్షా పరీక్షా కేంద్రాల వద్ద వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని, తాగునీరు అందుబాటులో ఉంచాలని, నిరంతర విద్యుత్ సరఫరా, హైస్పీడ్ నెట్ సదుపాయం ఉండాలని ఆదేశించారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకొనే విధంగా అదనపు బస్సులను నడపాలని ఆర్‌టిసి అధికారులకు సూచించారు. సంబంధిత ధృవీకరణ పత్రాల ఆధారంగా హాల్ టిక్కెట్లపై ఏమైనా తప్పులుంటే సరిదిద్దుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రత్యేక అవసరాలు కలవారికి అదనపు సమయం ఉంటుందని స్పష్టం చేశారు.

సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్. ప్రేమ్ కుమార్, ఎస్.ఎస్.ఎ. పీవో చంద్రశేఖర్, డీఎం%డ%హెచ్వో జగదీశ్వరరావు, ఆర్టీసీ, విద్యుత్, పోలీస్, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## వెన్నుపోటు దినం సక్సెస్

### బాబు ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత సుస్పష్టం : సజ్జల రామకృష్ణారెడ్డి




**అమరావతి, (విశాఖ సమాచారమ్):–** చంద్రబాబు ప్రభుత్వంపై తొలి ఏడాదిలోనే ప్రజా వ్యతిరేకత వచ్చిందని, ఇవాళ అది స్పష్టంగా కనిపించిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాలు విజయవంతమైనట్లు మీడియా ముఖంగా ప్రకటించారు. "ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలు ఏడాది గడిచినా అమలు కాలేదు. ఏడాది కాలంలోనే ప్రజా వ్యతిరేకత వచ్చింది. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోంది. వైఎస్సార్‌సీపీ ఇవాళ చేపటిన నిరసన కార్యక్రమం

(మిగతా 2లో)

2nd pages.qxd 6/4/2025 8:15 PM Page 2



# విద్యార్థుల మానసిక పరిణతికి వేసవి శిబిరాలు దోహదం

- జిల్లా ఉద్యానవన అధికారి రత్నాల వరప్రసాద్
- ఘనంగా కోస్టా లో వేసవి శిబిరం ముగింపు



నిర్వాహకురాలు అమ్మోజీని సత్కరిస్తున్న డీహెచ్ ఓ రత్నాల వరప్రసాద్



డీహెచ్ఓ రత్నాల వరప్రసాద్ ను సత్కరిస్తున్న తల్లిదండ్రులు

**రణస్థలం, (విశాఖ సమాచారమ్):-** విద్యార్థుల శారీరక ఎదుగుదలతో పాటు మానసిక భావోద్వేగాల పరిణతికి కూడా ఈ వేసవి శిబిరం ఎంతగానో దోహదం చేస్తుందని శ్రీకాకుళం జిల్లా ఉద్యానవన అధికారి రత్నాల వరప్రసాద్ అన్నారు. రణస్థలం మండలం కోస్టా పంచాయతీ లో మహిళా పోలీస్ బమ్మిడి అమ్మోజి నిర్వహించిన "ఏ1 బాల వికాస్ వేసవి శిక్షణ శిబిరం" ముగింపులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆత్మవిశ్వాసం, నైపుణ్యాలు పెంపొందించేలా ప్రత్యేక ప్రణాళికతో 33 రోజులు శిక్షణ ఇచ్చిన అమ్మోజీని ప్రశంసించారు. పిల్లల అభివృద్ధికి ఈ శిబిరాలు ఒక వరం లాంటివి అన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుంటూ తల్లితండ్రులు కూడా ముందుకు రావడం గొప్ప విషయం అని ప్రశంసించారు.

జే.ఆర్.పురం సీఐ ఎం.అవతారం విద్యార్థులను అభినందించారు. సెలవుల్లో సమయం సద్వినియోగం చేసుకొని ఇన్ని అంశాలు నేర్చుకున్నందుకు శుభాకాంక్షలు అందజేశారు. జే ఆర్ పురం ఎస్సై చిరంజీవి మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను వెలికి తీసే ఇలాంటి శిబిరాలు నిర్వహించడం గొప్ప విషయం అని కొనియాడారు. సామాజిక బాధ్యతగా నెల రోజుల శిబిరాన్ని ఇంత గొప్పగా నిర్వహించినందుకు నిర్వాహకురాలు అమ్మోజీని డీహెచ్ ఓ, ఎంపీడీవో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ విజయేంద్ర, త్రివేణి దంపతులు, హరిక్రిష్ణ, గుప్తా, తల్లిదండ్రులు ఘనంగా సత్కరించారు. అనంతరం డిహెచ్ఓ వరప్రసాద్ విద్యార్థులకు వశిష్ట ఇంగ్లీష్ మెటీరియల్, ప్రశంసాపత్రము అందజేశారు. ఈ నెలరోజుల శిబిరంలో ప్రతిభ చూపిన పదిమంది విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు అందజేశారు.

## జులై 21 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

పార్టీలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశాయి. దీనిపై ఢిల్లీలో జరిగిన కూటమి సమావేశంలో కాంగ్రెస్ నేతలు జైరాం రమేశ్, దీపేందర్ హుడా, తృణమూల్ కాంగ్రెస్ నేత డెరెక్ ఓబ్రియెన్, రాష్ట్రీయ జనతాదళ్ నేత మనోజ్ ఝా, సమాజ్‌వాదీ పార్టీకి చెందిన రామ్‌గోపాల్ యాదవ్, శివసేన (యూబీటీ) నాయకుడు సంజయ్ రౌత్ సహా పలు పార్టీల నేతలు పాల్గొన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ ఈ సమావేశంలో పాల్గొనకపోయినా ప్రత్యేక సమావేశం కోసం ప్రధానికి విడిగా లేఖ రాయనున్నట్లు వెల్లడించింది. బడ్జెట్ సమావేశాలు ఈ ఏడాది జనవరి 31న మొదలై.. ఏప్రిల్ 4న ముగిసిన విషయం తెలిసిందే.

## బియ్యం వద్దంటే.. ఇతర సరకులు!

అవుతోంది. అంటే ఆ మొత్తానికి సరిపడా కందిపప్పు, నూనె, ఇతర నిత్యావసరాలు ఇవ్వాలని యోచిస్తోంది.

**ధాన్యం సేకరణపై ప్రభావం**

ప్రభుత్వం మద్దతు ధరపై ఏటా సుమారు 42 లక్షల నుంచి 50 లక్షల టన్నుల ధాన్యం సేకరిస్తూ...25.46 లక్షల టన్నుల బియ్యం పంపిణీ చేస్తోంది. నగదు బదిలీ అమలు చేస్తే మిగిలే బియ్యాన్ని ఏం చేయాలనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. విదేశాల నుంచి డిమాండ్ ఉన్నా పౌరసరఫరాలశాఖ ద్వారా ఎగుమతి చేసే వ్యవస్థ లేదు. తెలంగాణలో ధాన్యం ఉత్పత్తి భారీగా పెరిగిన నేపథ్యంలో అక్కడి ప్రభుత్వం విదేశాలతో ఒప్పందం చేసుకుని ఎగుమతులు చేపట్టింది. ఏపీ కూడా ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారిస్తోంది.

**మాఫియాకు అడ్డుకట్ట**

రేషన్ బియ్యం పేదల కోసమే అయినా.. 70 శాతం బియ్యం నల్లబజారుకు తరలుతోంది. రూ.వేల కోట్ల లావాదేవీలతో ఇదో పెద్ద మాఫియాగా తయారైంది. ధాన్యం సేకరణ మొదలుకొని అడుగడుగునా అక్రమాలే. రైతు నుంచి ధాన్యం కొనాలంటే ఎదురు సొమ్ము వసూలు చేస్తున్నారు. మిల్లింగ్, స్టేజ్-1, 2 రవాణా, రేషన్ దుకాణాలు, ఎండీయూ వాహనాల వరకు ఎక్కడికక్కడ పక్కదారి పడుతున్నాయి. అంతటా వసూళ్ల రాజ్యమే. నగదు బదిలీ వస్తే మాఫియా నోట్లో పచ్చి వెలక్కాయ పడుతుంది.

## మంత్రులు దూకుడు పెంచాలి

వివిధ సంస్థలకు చేసిన భూ కేటాయింపులు, రాయతీల కల్పనకు క్యాబినెట్ ఆమోదం

రక్షితనీటి సరఫరాకు శ్రీకాకుళంలో రూ.5.75 కోట్ల వయబిలిటీ గ్యాప్ ఫండ్‌కు ఆమోదం

కుప్పంలో రూ.8.22 కోట్లు వయబిలిటి గ్యాప్‌ఫండ్ విడుదలకు ఆమోదం

సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదలకే కేబినెట్ ఆమోదం. 1 ఫిబ్రవరి 2025 నాటికి అర్హులైన 17 మంది యావజ్జీవ ఖైదీలకు క్షమాభిక్ష మంజూరు

248 మంది కానిస్టేబుళ్లకు పదోన్నతి కల్పించే ప్రతిపాదనకు ఆమోదం

వైఎస్సార్ జిల్లా పేరును వైఎస్సార్ కడప జిల్లాగా మారుస్తూ తెచ్చిన జీవోకు ఆమోదం

పోలీసు అకాడమీకి అదనంగా 94.45 ఎకరాలు ఇచ్చేందుకు ఆమోదం

మహిళలు రాత్రిపూట కూడా పనిచేసే చట్టసవరణకు ఆమోదం. రాత్రిపూట పనిచేసే మహిళలకు భద్రత, రవాణా సౌకర్యం కల్పించాలి.

## ప్రజలను మోసంచేసినందుకే వెన్నుపోటు దినం

తీవ్ర ఆవేదన, కోపాన్ని వ్యక్తం చేశారు. ఇది కేవలం నిరసన మాత్రమే కాదు.. మోసం చేస్తే మౌనంగా ఉండరనే శక్తివంతమైన సందేశాన్ని ప్రజలు ప్రభుత్వానికి ఇచ్చారు. బాధిత ప్రజలతో కలిసి నిరసన కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీలోని ప్రతి నాయకుడు, కార్యకర్త, ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ప్రజల న్యాయబద్ధమైన హక్కుల సాధన కోసం వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ పోరాడుతూనే ఉంటుంది" అని వైఎస్ జగన్ పేర్కొన్నారు.

## మేనిఫెస్టో అమలుపై చర్చకు సిద్ధమా?

గల రాజకీయ పార్టీగా ప్రజాతీర్పును విశ్లేషించుకుని పొరపాట్లు సరిదిద్దుకోవాలని సలహా ఇచ్చారు. తల్లి, చెల్లి పట్ల వ్యవహరిస్తున్న తీరుతోనే జగన్ జపించే నైతిక విలువల విలువెంతో ప్రజలకు తెలిసిందన్నారు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి కూడా కుమారుడి వైఖరిని విడిపోయారని, అధికారంలోకి వచ్చాక తండ్రి సమకాలికుడైన చంద్రబాబును జగన్ అవమానించిన తీరును సామాన్య ప్రజానీకం మరచి పోలేదని తెలియజేశారు. చంద్రబాబు సీఎంగా ఉండడం ఆంధ్రుల అదృష్టమని ఢిల్లీలో రాజశేఖర్ రెడ్డి షాపింగ్ కు వెళ్లినప్పుడు చెప్పారని, దేశంలో చంద్రబాబుకున్న గౌరవ, ప్రతిష్టలకు ఇదో ఉదాహరణని వివరించారు. అధికారంలో ఉండగా స్టీల్ ప్లాంట్ సమస్యపై పిల్లి మొగ్గలు వేసి.. ప్రైవేటీకరణ ప్రతిపాదనకు పరోక్షంగా సహకరించారని ఆరోపించారు.

### అభివృద్ధి చేస్తున్నందుకా వెన్నుపోటు దినం?

కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి ఊపందుకుందని గంటా చెప్పారు. వైసీపీ హయంలో ఏపీ గుంతలకు కేరాఫ్ అడ్రస్ గా ఉండేదని, కూటమి హయంలో 50 వేల గుంతలు పూడ్చామని, వేల కిలోమీటర్ల పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి, మున్సిపల్ రోడ్లు వేశామని తెలిపారు. "వైసీపీ స్మశానంగా మార్చిన అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చి దిద్దుతున్నందుకా? ఆంధ్రుల జీవనాడి పోలవరాన్ని పట్టాలెక్కించినందుకా? రైల్వే జోన్ సాధించి పనులు ప్రారంభించినందుకా? మెట్రో రైల్ కు రూ.17,232 కోట్లతో డీపీఆర్ తయారు చేసి ముందుకు వెళ్తున్నందుకా? విశాఖ స్టీల్ ప్లాంట్ కు రూ.14,400 కోట్ల ప్యాకేజీ తీసుకువచ్చినందుకా? దేనికి వెన్నుపోటు దినం పిలుపిచ్చారని" ఆయన వైసీపీ నాయకులను నిలదీశారు.

అధికారం చేపట్టిన రోజునే 16,347 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్.. అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ.. ల్యాండ్ టైటలింగ్ యాక్టు రద్దు.. రూ.3 వేల పెన్షన్ రూ.4 వేలకు పెంపు.. దస్త్రాలపై ముఖ్యమంత్రి సంతకాలు చేశారని గుర్తు చేశారు. ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ మొదలైందని, మహిళలకు ఉచిత బస్సును ఆగస్టు 15. నుంచి ప్రారంభిస్తామన్నారు. ఈనెల 12 నుంచి తల్లికి వందనం.. రైతులకు ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. చరిత్రలో లేని విధంగా కూటమి పార్టీలు 55.30 శాతం ఓట్లతో 94 శాతం సీట్లు సాధించాయని అన్నారు. జగన్మోహన్ రెడ్డి మళ్లీ గెలిస్తే రాష్ట్రానికి.. ప్రజలకు.. నష్టమనే భయంతో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు 95 వేలు.. భీమిలిలో తనకు 93 వేలు.. మంగళగిరిలో 91 వేల భారీ మెజారిటీలు ఇచ్చారని తెలిపారు. 6 శాతం సీట్లు తెచ్చుకున్న వైసీపీకి ప్రతిపక్ష హోదా రాదని, హోదా ఇవ్వలేదని ఏడాదిగా జగన్ అసెంబ్లీకి రాలేదన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు పి.వి.నరసింహం, లొడగల అప్పారావు, రాష్ట్ర కార్యదర్శి గంగా నూకరాజు, మొల్లి లక్ష్మణరావు, జనసేన నాయకుడు శాఖారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కమల్‌హాసన్ రాజ్యసభ నామినేషన్ వాయిదా

తన చిత్రం 'థగ్ లైఫ్' వ్యవహారాలు పూర్తయిన తర్వాతే నామినేషన్ వేయాలని భావిస్తున్నట్లు తెలిపాయి.

కమల్ 2018లో ఎంఎన్ఎం పార్టీని స్థాపించారు. విపక్ష ఇండియా కూటమిలో ఇది భాగం. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తమిళనాడులో డీఎంకే, కాంగ్రెస్ కూటమికి మద్దతు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఒప్పందంలో భాగంగా రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాలు, పుదుచ్చేరిలోని ఒక స్థానంలో ఎంఎన్ఎం ప్రచారం చేసింది. 2025 ఎగువసభ ఎన్నికల్లో ఎంఎన్ఎం పార్టీకి రాజ్యసభ స్థానం ఇచ్చేందుకు డీఎంకే నేతృత్వంలోని కూటమి అంగీకరించింది. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో డీఎంకేతో కుదిరిన ఈ ఒప్పందం ప్రకారం ఎంఎన్ఎంకు ఎగువసభ స్థానం కేటాయించారు. దీంతో కమల్ హాసన్ రాజ్యసభకు వెళ్లనున్నారనే విషయాన్ని డీఎంకే-ఎంఎన్ఎం ఇటీవల ఖరారు చేశాయి.

ఇటీవల నిర్వహించిన 'థగ్‌లైఫ్' సినిమా ఈవెంట్‌లో తమిళం నుంచే కన్నడ పుట్టిందని కమల్ వ్యాఖ్యానించడంతో భాషా వివాదం మొదలయ్యింది. కమల్ వ్యాఖ్యలను కన్నడ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో కర్ణాటకలో థగ్‌లైఫ్ చిత్రాన్ని నిషేధించాలని కోరుతూ ఆ రాష్ట్ర ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (కేఎఫ్‌సీసీ) హైకోర్టును ఆశ్రయించింది. ఆ పిటిషన్‌ను మంగళవారం విచారించిన న్యాయస్థానం కమల్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. క్షమాపణ చెబితే అన్నీ పరిష్కారమయ్యేవని వ్యాఖ్యానించింది. దీంతో ఈ చిత్రాన్ని కర్ణాటకలో ప్రస్తుతానికి విడుదల చేయకూడదని కమల్‌హాసన్ నిర్ణయించారు. అనంతరం, తన వ్యాఖ్యలను అపార్థం చేసుకున్నారంటూ 'కేఎఫ్‌సీసీ'కి కమల్ లేఖ రాశారు. అయితే, అందులోనూ సారీ చెప్పకపోవడం గమనార్హం.

## వెన్నుపోటు దినం సక్సెస్

విజయవంతమైంది. వైఎస్సార్‌సీపీ కష్టాల నుంచే పుట్టింది. మా హయాంలో 15 ఏళ్లలో జరగాల్సిన అభివృద్ధి.. మూడేళ్లలోనే జరిగింది. అధికారంలోకి రాగానే మేం తొలి ఏడాదిలోనే 99 శాతం హామీలు అమలు చేశాం. కోవిడ్ రెండేళ్లలోనూ సంక్షేమ పథకాలు అమలు చేశాం. మిగిలిన మూడేళ్లలోనే 10, 15 ఏళ్ల అభివృద్ధి చూపించాం. విద్య, వైద్య, వ్యవసాయం రంగాలకు ప్రాధాన్యం ఇచ్చాం" అని చెప్పుకొచ్చారు.

"కానీ.. చంద్రబాబు పాలనలో వ్యవస్థలు అన్నీ సర్వనాశనం అయ్యాయి. తొలి ఏడాదిలోనే రికార్డ్ స్థాయిలో(రూ.లక్షా 50వేల కోట్లకు పైగా) చంద్రబాబు అప్పులు చేశారు. ఆ అప్పు ఏం చేశారో తెలియదు. ఏడాదిలోనే రైతులను సంక్షోభంలోకి నెట్టేశారు. పంటలకు కనీస మద్దతు ధరలు లేవు. ఇప్పటికే 4 లక్షల పెన్షన్లు కట్ చేశారు. వైఎస్ జగన్ తెచ్చిన సంక్షేమ పథకాలను సైతం ఎత్తేశారు. చంద్రబాబు తీరుపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది" అని సజ్జల అన్నారు.

# కూటమి ప్రభుత్వంపై తానేటి వనిత మండిపాటు




**నల్లజర్ల, (విశాఖ సమాచారమ్):-** నల్లజర్ల లో వెన్నుపోటు దినం కార్యక్రమంలో మాజీ హోంమంత్రి తానేటి వనిత పాల్గొన్నారు గోపాలపురం నియోజకవర్గంలో నల్లజర్ల మండలంలో వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు వేలాదిగా జనసంద్రముగా ర్యాలీగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు అయితే వెన్నుపోటు దినం కార్యక్రమంలో నల్లజర్ల గ్రామంలో ర్యాలీగా వేలాదిమంది క్రమంగా భయంకరమైన ఎండను ఎదిరించి శాంతియుతంగా ర్యాలీని కొనసాగించి గ్రామంలో ఉన్నటువంటి ఎమ్మార్వో కి రెప్రెంటేషన్ ఇవ్వటం జరిగింది ఈ రోజున జూన్ 4వ తేదీ కరెక్ట్ గా కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి సంవత్సరం కాలము పూర్తయింది వాళ్లు అధికారంలోని రావడానికి ముందు చాలా హామీలు ఇచ్చారు సూపర్ సిక్స్ అని అమ్మ ఒడి అని ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి 15000 ఇస్తామని ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఇస్తామని 18 సంవత్సరాలు నిండి 60 సంవత్సరాల లోపు అన్న వారందరికీ ఇస్తామని అన్నారు ఈ రోజున ఒక్క హామీ కూడా అమలుపరచట్లేదు రైతులకు 20,000 ఇస్తానన్నారు నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు సంపద సృష్టిస్తామన్నారు ఈ రోజున వాళ్ళు అధికారంలోనికి వచ్చి నిజంగా ప్రజల సానుభూతి పొంది అభిమానము పొంది అధికారంలోనికి రాలేదు ఎంత సేపు కూడా అసత్య ప్రసారాలు చేసి అధికారంలోకి వచ్చి ఈ రోజున ప్రజలను వెన్నుపోటు పొడిచారు అంటే వెన్నుపోటు పొడిచిన విధానము సంస్కృతి సాంప్రదాయము ఎప్పటిదికాదు సీనియర్ ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనను ఏ విధంగా వెన్నుపోటు పొడిచి పార్టీని లోక్కున్నారో పదవులను లాక్కున్నారో ఏం చేశారు ప్రజలందరికీ ప్రపంచానికి తెలుసు ఈ రోజున రోడ్డు మీదికి రావటం జరిగింది కారా వారి పాలన నరకం లాగా ఉంది అని అన్నారు ప్రతి ఒక్కరూ ప్రజలందరూ నరకయాతన పడుతున్నారు ఎందుకు ఓటు వేసాము అని బాధపడుతున్నారు జన సైనికులు కూడా ఎందుకు ఓటు వేసావని బాధపడుతున్నారు ఎంత భయంకరమైన పరిపాలన రాష్ట్రంలో ఉంది ప్రజలను మోసం చేయడం బాగా చేయడం వెన్నుపోటు పడడం కాదు వీళ్ళకి ఓటు ఎందుకు వేసాము అని కార్యకర్తలు నాయకులు బాధపడుతున్నారు వైసీపీ కార్యకర్తలను వైసీపీ నాయకులను వాళ్ల మీద లేనిపోని ఉపయోగాలు అక్రమ కేసులు పెట్టడం తప్పులు కేసులు పెట్టడం అరెస్టులు చేయించడం జైలుకు పంపడం వారిని ఇబ్బంది పెట్టడం మాజీ శాసనసభ్యులను మాజీ మంత్రులను ఐఏఎస్ లను ఐపీఎస్ లను వాళ్లను కూడా భయపెడుతున్నారు అరెస్టులు చేయడం అరాచకాలను సృష్టించడం అక్రమాలు చేయడం వాళ్ల మీద పగ తీర్చుకునే ధోరణి చేస్తూ ఉన్నారు ప్రజలు వీళ్లకు అధికారం ఇచ్చింది దేనికి మంచి పరిపాలన అందిస్తారని ప్రభుత్వానికి అధికారం ఇచ్చారు సంవత్సరం కాలంలో ఆంధ్ర రాష్ట్ర ప్రజలందరికీ ఈ కూటమి ప్రభుత్వం మీద ప్రాక్టిగలిగింది ఇటువంటి వారికి మేము ఓటు వేసిందా అని ప్రజలందరూ భయభ్రాంతులకు గురవుతున్నారు ఇప్పటికైనా ప్రజలందరికీ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని చెప్పి డిమాండ్ చేస్తున్నాం. కోటపై ప్రభుత్వానికి మేము చెప్పేది ఏమనగా చేయగలిగితే చేస్తామని చెప్పాలి చేయలేకపోతే చేయలేమని చేతకాదని గమ్మునా ఉండాలి చంద్రబాబునాయుడు 40 సంవత్సరాలు ఇండస్ట్రీ అని చెప్తూ ఉంటారు చంద్రబాబు పరిపాలన నరకాసురుని పరిపాలనగా ఉందని అన్నారు రాష్ట్రంలో ఎన్ని అప్పులు ఉన్నాయో తెలియదా ఏ పథకానికి ఎంత ఖర్చవుతుందో తెలియదా ఆయనకు తెలియకుండానే ఎన్ని సూపర్ సిక్స్ లు హామీలు ఇచ్చారా అంటే మాటలు కాదు చేయగలిగితేనే చెప్పాలి చెబితే చేయాలి ప్రజలను మోసం చేయడం అసత్యాలు చెప్పడం మోసపూరితమైన వాగ్దానాలు ఇవ్వటం దగా చేసి మోసం చేసి ప్రజలను ఆంధ్ర రాష్ట్ర ప్రజలను వెన్నుపోటు పడటం కాదు లోకేష్ అన్నాడు కదా మేము ఈ పథకాలు చేయకపోతే మా నాయకులను మా మంత్రులను మా ఎమ్మెల్యేలను కాలర్ పట్టుకుని నిలదీయండి అని అన్నారు మాటలు కాదు చేతలు చేసి చేతల్లో చూపించాలని ఈ అసత్య అబద్ధాలు దగాకూరు మాటలు వెన్నుపోటు మాటలు మానుకోవాలని వారికి వారి ప్రభుత్వానికి తెలియజేస్తున్నామని అన్నారు

## హెక్టగూడలో సుపరిపాలన సందడి

### చిట్టం మురళి నేతృత్వంలో ఘనంగా వేడుకలు

**అరకులోయ, (విశాఖ సమాచారమ్):-** రాష్ట్రంలో శుభ పాలనకు ఏడాది పూర్తయిన సందర్భంగా, అనంతగిరి మండలంలోని హెక్టగూడ గ్రామంలో "సుపరిపాలనకు ఏడాది" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలు జనసేన పార్టీ అనంతగిరి మండల అధ్యక్షుడు చిట్టం మురళి ఆధ్వర్యంలో జరుగగా, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, "ఈ రోజు రాష్ట్ర ప్రజలు రాక్షస పాలన నుంచి విముక్తి పొందిన గర్వదినం. గత ప్రభుత్వం అమలుచేసిన చెడు పాలనకు చరమగీతం పాడిన రోజు ఇది. ప్రజాస్వామ్యం, పారదర్శకతకు విజయోత్సవం" అని పేర్కొన్నారు.

వైసీపీ పాలనపై తీవ్ర విమర్శలు చేసిన వారు, గిరిజనుల హక్కులను విస్మరించడం, జీవో నంబర్ 3 పై రివ్యూ పిటిషన్ దాఖలు చేయకపోవడం గిరిజన యువతపై వెన్నుపోటుగా అభివర్ణించారు. హైడ్రో పవర్ ప్రాజెక్టుల పేరుతో గిరిజన భూములు కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు చేసిన ప్రయత్నాలను తీవ్రంగా తప్పుబట్టారు.

అలాగే బోయ, వాల్మీకి వర్గాలను ఎస్టీ జాబితాలో చేర్చే ప్రయత్నాల వెనుక గిరిజన వైసీపీ నాయకుల ప్రమేయం ఉండటం, గిరిజనులకు ఎదురుదెబ్బగా పేర్కొన్నారు. గంజాయి స్మగ్లర్లు, మద్యం కుంభకోణాల కేసుల్లో నిందితులకు జగన్ మోహన్ రెడ్డి అండగా నిలిచినదే వైసీపీ అసలైన స్వభావానికి నిదర్శనమని విమర్శించారు.

ఒకవైపు వైసీపీ "వెన్నుపోటు దినం"ను జరుపుకుంటుండగా, మరోవైపు కూటమి పార్టీలు "సుపరిపాలనకు ఏడాది" వేడుకలను నిర్వహించడంవిశేషమని వారు వ్యాఖ్యానించారు.

ఈ కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు సుబ్బారావు, జనసేన నాయకులు కొర్ర రవి, పాంగి లక్ష్మణ్, తెదేపా నాయకులు బాబీ, శంకర్రావు, భీమన్న, ధర్మాన, గ్రామస్థులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

**విజయనగరం, (విశాఖ సమాచారమ్):-** రాష్ట్రంలో పచ్చదనాన్ని మరింతగా పెంచే లక్ష్యంతో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించుకొనే జూన్ 5 నుంచి వన మహోత్సవ కార్యక్రమాలను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ వెల్లడించారు. వనమహోత్సవంలో భాగంగా వనం- మనం పేరుతో రాష్ట్రంలో 1 కోటి మొక్కలు నాటాలని నిర్ణయించిందని, దీనిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 4 లక్షల మొక్కలు నాటే కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించనున్నట్టు చెప్పారు. అన్ని గ్రామాలు, మండలాలు, పట్టణాల్లో మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలని ఇందుకు అవసరమైన మొక్కలను అటవీశాఖ నుంచి పొందవచ్చని చెప్పారు. జిల్లా అటవీశాఖ వద్ద 33 నర్సరీల్లో 20 లక్షల మొక్కలు అందుబాటులో వున్నాయని సమీప నర్సరీల నుంచి మొక్కలు పొందాలని తెలిపారు.

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లాలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో మొక్కలు నాటేందుకు నిర్ణయించారని, దీనిలో భాగంగా జిల్లాలో 4 లక్షల మొక్కలు నాటాలని నిర్దేశించారని, ఈ మేరకు రోడ్ల ప్రక్కన నీడనిచ్చే మొక్కలు, కళాశాలలు, విద్యాసంస్థలు, హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు తదితర ప్రదేశాల్లో పండ్ల మొక్కలు నాటే ఏర్పాట్లు చేయాలన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పరిశ్రమల ఆవరణల్లో రెండు లక్షల మొక్కలు నాటేందుకు చర్యలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు.

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఇకో వాక్‌లు, సైకిల్ ర్యాలీలు, గ్రీన్ రన్ వంటి కార్యక్రమాలు చేపట్టి ఈ కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన కలిగించాలన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించే మొక్కలు నాటే కార్యక్రమాల్లో అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని, జిల్లాలో పచ్చదనం పెంచేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు.

## మాజీ మంత్రి బొత్సకు అస్వస్థత




**చీపురుపల్లి, (విశాఖ సమాచారమ్):-** వైసీపీ ఎమ్మెల్సీ, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అస్వస్థతకు గురయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న సమయంలో.. వెన్నుపోటు దినోత్సవంగా వైసీపీ నిరసనలు చేపట్టింది. ఇందులో భాగంగా బొత్స సత్యనారాయణ విజయనగరం జిల్లా చీపురుపల్లి లో నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతుండగా అస్వస్థతకు గురై ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. దీంతో ఆయనను హుటాహుటిన ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. దీంతో పార్టీ శ్రేణులు ఆందోళన చెందారు. కాగా రెండు గంటల తర్వాత ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ కోలుకొని.. కార్యకర్తలకు సందేశం ఇచ్చారు. ప్రస్తుతం తాను ఆరోగ్యంగానే ఉన్నానని కార్యకర్తలు ఎవరూ ఆందోళన చెందాల్సిన పరిస్థితి లేదని పేర్కొన్నారు. వైద్య పరీక్షల తర్వాత బొత్స ఇంటికి చేరుకున్నారు. బొత్స ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. విశ్రాంతి అవసరం అని సూచించారు.

## కూటమి ప్రభుత్వంపై మండిపాటు



**గోపాలపురం, (విశాఖ సమాచారమ్ ప్రతినిధి):**

వైఎస్ఆర్సిపి రాష్ట్ర ప్రచార విభాగం ఉపాధ్యక్షుడు కూసంరామ్మోహన్ రెడ్డి కార్యకర్తలను నాయకులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై అన్ని రంగాల్లో విఫలమైందని అసత్య ప్రచారాలు చేస్తుందని ఇచ్చిన హామీలను మరిచిపోయిందని ప్రజలను మోసం చేస్తుందని అని అన్నారు . ఇచ్చిన హామీలు మరిచిపోయి ప్రజలను వెన్నుపోటు పొడుస్తుందని అన్నారు . అనంతరం వైఎస్ఆర్సిపి జెండాను ఊపి ఈ ర్యాలీని ప్రారంభించారు .శఈ కార్యక్రమంలో వెలగ శ్రీరామమూర్తి , ముల్లంగి శ్రీనివాసరెడ్డి , వింత అమర ప్రసాద్ రెడ్డి , ఆనంద్ పాల్, గల్లా శ్రీను పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




కాకినాడ లో జనసేన పార్టీ వారు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

**కాకినాడ, (విశాఖ సమాచారమ్):-**

2nd pages.qxd 6/4/2025 8:15 PM Page 3



# అరకులోయలో వెన్నుపోటు దినోత్సవం




**అరకులోయ, (విశాఖ సమాచారమ్):-** మండల కేంద్రంలో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆధ్వర్యంలో వెన్నుపోటు దినోత్సవ కార్యక్రమం జరిగింది. కూటమి ప్రభుత్వం చేసిన మోసపూరిత హామీలు నివసిస్తూ నిర్వహించిన వెన్నుపోటు దినోత్సవ కార్యక్రమంలో భాగంగా విశాఖ ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్పర్సన్ జల్లి పల్లి సుభద్ర , అరకులోయ నియోజకవర్గం పరిధిలోని 6 మండలాలకు చెందిన 1000 మంది వైసీపీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అరకులోయ ప్రధాన రహదారి మీదుగా భారీ ర్యాలీని నిర్వహించి తాసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయినప్పటికీ ఇంతవరకు ఇచ్చిన హామీలులో ఒకటి కూడా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రవేశపెట్టి వాటిని అమలు చేస్తామని నమ్మబలికి, ఒకటి కూడా అమలు చేయలేదన్నారు.


## ఈస్ట్ కోస్ట్ రైల్వే

(1) టెండరు ప్రకటన నెం. eT-HQ-WAT-15-2025, తేదీ. 29.05.2025

**పని పేరు:** (1) అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరు/ఎస్టేట్/వాల్తేరు వారి పరిధిలోని సీనియర్ సెక్షన్ ఇంజనీరు/W/ఈస్ట్ సెక్షన్‌లోని డాల్ఫిన్ నోస్ మరియు హార్బర్ కాలనీలు యొక్క టైపు-II మరియు టైపు-III స్టాఫ్ క్వార్టర్లుకు ఇంప్రూవ్‌మెంట్స్ మరియు (2) సీనియర్ సెక్షన్ ఇంజనీరు/W/నార్తు సెక్షన్‌లోని సింహగిరి (ఈస్ట్ & వెస్ట్) రైల్వే కాలనీలు యొక్క టైపు-II మరియు టైపు-III స్టాఫ్ క్వార్టర్లుకు ఇంప్రూవ్‌మెంట్స్.

**పని విలువ సుమారు:** ₹ 1,90,16,027.37, బయానా: ₹ 2,45,100/-.

(2) టెండరు ప్రకటన నెం. eT-HQ-WAT-16-2025, తేదీ. 29.05.2025

**పని పేరు:** (1) అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరు/ఎస్టేట్/వాల్తేరు వారి పరిధిలోని సీనియర్ సెక్షన్ ఇంజనీరు/W/ఈస్ట్ సెక్షన్‌లోని డాల్ఫిన్ నోస్ మరియు హార్బర్ కాలనీలలోని శిధిలమైన (పాడయిన) తలుపులు మరియు కిటికీలు రీప్లేసుమెంట్ మరియు (2) సీనియర్ సెక్షన్ ఇంజనీరు/W/నార్తు సెక్షన్‌లోని సింహగిరి ఈస్ట్ మరియు వెస్ట్ రైల్వే కాలనీలలో శిధిలమైన (పాడయిన) తలుపులు మరియు కిటికీలు రీప్లేసుమెంట్ చేయుట.

**పని విలువ సుమారు:** ₹ 2,03,57,469.55, బయానా: ₹ 2,51,800/-.

పని పూర్తి చేయు కాలం: 08 నెలలు (వ.నెం. 1 కొరకు) & 06 నెలలు (వ.నెం. 2 కొరకు).

**టెండరు ముగింపు తేదీ మరియు సమయం:** 23.06.2025న 1500 గంటలకు (రెండు టెండర్లు కొరకు).

ఇందుకు సంబంధించి మాన్యువల్ ఆఫర్లు ఇ-టెండర్లకు సంబంధించి పోస్టు / కొరియర్ / ఫ్యాక్స్ లేదా స్వయంగా తమ సంస్థ లెటర్ హెడ్స్ పైన, సకాలంలో అందునట్లు పంపినప్పటికి అంగీకరించబడవు. అట్టి అన్ని మాన్యువల్ ఆఫర్లు చెల్లుబాటు కానివిగా పరిగణించవడతాయి మరియు ఎలాంటి పరిశీలన లేకుండానే తిరస్కరించబడతాయి.

పై ఇ-టెండరుకు సంబంధించిన పూర్తి సమాచారం ఇ-టెండరు డాక్యుమెంట్లతో పాటు www.ireps.gov.in వెబ్‌సైట్ నందు లభిస్తాయి.

సూచన: విశ్వసనీయ టెండరుదారులు ఈ టెండరుకు సంబంధించి ఏదైన మార్పులు / సవరణలు కోసం టెండరు ముగింపు తేదీకి 15 (పదిహేను) రోజులు ముందుగా ఈ టెండరును మరోకసారి చూడవలసినదిగా సలహానీయటమైనది.

డివిజనల్ రైల్వే మేనేజర్ (ఇంజనీరింగ్), వాల్తేరు

PR-195/Q/25-26


# కూటమి ప్రభుత్వానికి సంవత్సరం



**పరవాడ, (విశాఖ సమాచారమ్):-** పెందుర్తి నియోజకవర్గం పరవాడ మండలం ముత్యాలమ్మపాలెంలో కూటమి ప్రభుత్వం సంవత్సరం పూర్తి కావడంతో బుధవారం సంబరాలు చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, నరేంద్ర మోడీ నాయకత్వంలో ముఖ్యమంత్రిగా తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, భారతదేశ ప్రధాని నరేంద నాయకత్వంలో రాష్ట్రంలో ఎన్ డి ఏ ప్రభుత్వం ఏడాది పూర్తయిర్భంగా పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, ఆదేశాల మేరకు రాష్ట్ర మత్స్యకార సంఘాల సామాఖ్య ప్రధాన కార్యదర్శి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చింతకాయల ముత్యాలు అధ్యక్షతన ముత్యాలమ్మపాలెం లో జరిగిన ఈ కార్యక్రమంలో జగన్ పీడ విరగడై ఏడాది గడిచిన సందర్భంగా రాష్ట్రంలో ఎన్‌డిఏ ప్రభుత్వంలో సుపరిపాలన అందించి నేటికి సంవత్సరం పూర్తయిన సందర్భంలో రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలతో పాటు మత్స్యకార పథకం కింద 20 వేల రూపాయలు, ఆడపడుచులకు మూడు గ్యాస్ సిలిండర్లు, పెన్షన్ వృద్ధులకు వితంతువులకు 4000 రూపాయలు, వికలాంగులకు 6000 రూపాయలు, మంచానికి పరిమితమైన వాళ్లకి 15000, మరియు జూన్ నెలలో తల్లికి వందనం, రైతు భరోసా మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు, రాష్ట్రంలో పంచాయతీలలో గ్రామాల్లో పల్లె పండగ-అభివృద్ధి వెలుగులు ఈ కార్యక్రమం ద్వారా పెద్ద ఎత్తున సిసి రోడ్లు కాలువలు అభివృద్ధి జరిగింది , విశాఖ రైల్వే జోన్ శంకుస్థాపన చేయడం జరిగింది, పోలవరం ప్రాజెక్ట్ 15 వేల కోట్లు రూపాయలతో శరవేగంగా అభివృద్ధి పూర్తవుతుంది, ఆంధ్ర రాష్ట్ర ప్రజల కలల రాజధానిగా అద్భుతంగా అమరావతి మహానగరం గా అభివృద్ధి అవుతుందని అన్నారు.

ముత్యాలమ్మపాలెంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా, రంగులతో ముగ్గులు వేసి రంగవల్లులతో అందంగా తీర్చి దిద్దిన మహిళలకు ముఖ్య అతిథి గా విచ్చేసిన జనసేన పార్టీ పరవాడ మండలం ఇంచార్జ్ పంచకర్ల ప్రసాద్ చేతుల బహుమతులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి పైల జగన్నాథరావు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, జనసేన పార్టీ పరవాడ మండల అధ్యక్షులు బొద్దపు శ్రీనివాస్, టిడిపి మండల అధ్యక్షులు వియ్యపు చిన్న, సర్పంచులు, చింతకాయల సుజాత, మోటూరు సన్యాసినాయుడు, ఎంపీటీసీలు అర్జిల్లి దేవిరవి, మైలపల్లి అప్పన్న, కూంద్రపు శ్రీరామ్మూర్తి, సీనియర్ జనసేన పార్టీ వీర మహిళ గొన్న రమాదేవి, పీలా శివకృష్ణ, పంచకర్ల మణికంఠ నాగిరెడ్డి చిన్నారావు, ఉప సర్పంచ్ సూరాడ పెంటయ్య, మాజీ ఎంపీటీసీ చింతకాయల అమ్మోరు, మాజీ కో-ఆపరేట్ బ్యాంక్ డైరెక్టర్ సూరాడ ముత్యాలరావు, సమ్మంగి సోమేశ్వరరావు, ఒలిశెట్టి అప్పలరాజు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పరవాడలో గ్రావెల్ మాఫియా



**పరవాడ, (విశాఖ సమాచారమ్):-** పరవాడ మండల%శీ%లో భారీగా ఎక్కడపడితే అక్కడ గ్రావెల్ మాఫియా చెలరేగిపోతుంది.

పెదముసిడివాడ, మంత్రిపాలెం, దేశపాత్రునిపాలెం, ఈ బోనంగి, పి బోనంగి, ఫార్మాసిటీ కాలనీ లలో విచ్చలవిడిగా గ్రావెల్ మాఫియా దందా కొనసాగుతున్న సరే పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. జిల్లా ఆర్డీవో, జిల్లా కలెక్టర్ ప్రజా ఫిర్యాదులో ఎన్ని కంప్లైంట్ లు ఉన్న సరే పట్టించుకోకుండా బోకర్లకు సహాయం చేస్తున్న రెవెన్యూ అధికారులు.

గెడ్డలు, వాగులు, చెరువులు, కొండలు, గుట్టలు తదితర ఏది కనిపిస్తే అది వదలకుండా తవ్వుకొని పోతున్నారు. కళ్ళ ముందు, రోడ్డు పక్కన గౌతు లచ్చన్న నగర్ వ్యవసాయ భూమిలో డెవలప్మెంట్ కొరకు రాత్రి పగలు తేడా లేకుండా అనుమతులు లేని గ్రావెల్ ఫిల్లింగ్ జరుగుతున్న రెవిన్యూ అధికారులు వాటిపై కన్నెత్తి చూడకపోవడం పై పలువురు అనుమానాలు వ్యక్తపరుస్తున్నారు. వీరికి ఇంత గ్రావెల్ ఎలా వస్తుంది మైనింగ్ అధికారులు వీటిపై ప్రత్యేకమైన దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# వెన్నుపోటు దినం నిరసన.. . మాజీ ఎమ్మెల్యే అదిప్ రాజు



**పరవాడ, (విశాఖ సమాచారమ్):-** పెందుర్తి నియోజకవర్గం వైఎస్ఆర్సీపీ మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్ ఆధ్వర్యంలో బుధవారం వెన్ను పోటు దినం నిరసన తెలియచేశారు. కూటమి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని,చేసిన మోసాలను తెలుపుతూ నేడు రాంపురం కార్యాలయం నుండి పెందుర్తి తహశీల్దార్ కార్యాలయం వరకు కార్యకర్తలతో ర్యాలీగా వెళ్ళి తహశీల్దార్ ఆనంద్ కుమార్ కి వినతి పత్రం ఇచ్చారు. జగన్ కన్నా మంచి పరిపాలన చేస్తామని నమ్మించి ప్రజలను మోసం చేసిన చంద్రబాబుకి వ్యతిరేకంగా వెన్నుపోటు కార్యక్రమం చేపట్టారు. రామారావు కి వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు...అదే వెన్నుపోటు నేడు ప్రజలకు పొడిచారు అని అన్నారు. ఈ సందర్భంగా అదీప్ రాజ్ మాట్లాడుతూ హామీలు అమలు చేయటానికి నాది బాధ్యత అని చెప్పి చంద్రబాబు,పవన్ కళ్యాణ్ లు ప్రజలకు బాండ్ పేపర్లు ఇచ్చారు..ఆ బాండ్ పేపర్లు ఏమి చేయాలి ఎక్కడ పెట్టుకోవాలి అని ప్రజలు నిలదీస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి అని ప్రజలు ప్రశ్నస్తున్నారు..చంద్రబాబు చేసిన మోసం అర్థమయ్యి జగన్ ను ఎందుకు ఓడించామని బాధపడుతున్నారు.మళ్లీ ఎన్నికలు ఎప్పుడు వస్తాయా జగన్ ను మళ్లీ ఎప్పుడు గెలిపించుకుందామా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఈ రాష్ట్రం లో శాంతియుతంగా నిరసన తెలిపి కార్యక్రమాలకు కూడా పోలీస్ వ్యవస్తను అడ్డం పెట్టుకొని అడుగడుగునా ఆంక్షలు విధిస్తున్నారు. ఇంటిదగ్గరకు వచ్చి రేషన్ అందించే ఎండుయు వాహనాలను తీసివేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు..సంక్షేమ పథకాలు అభివృద్ధి రెండూ లేవు..సంవత్సర కాలంగా రెడ్ బుక్ రాజ్యాంగం తప్ప రాష్ట్రంలో ఏమి జరగలేదు..ఐఏఎస్, ఐపీఎస్ లు అనే తేడా లేకుండా అందరిపై కక్ష సాధింపూ చర్యలకు దిగుతున్నారు..ప్రశ్నించే గొంతులను తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులు గురిచేస్తున్నారు, ఇదే పెందుర్తి నియోజకవర్గం లో సీనియర్ ఎమ్మెల్యే అని చెప్పుకొనే వ్యక్తి ఆధ్వర్యంలో ప్రభుత్వ భూమి కబ్జాలు, గ్రవల్ దందాలు, చెరువు కబ్జాలు చేస్తూ అధికారంలోకి వచ్చింది వాళ్ళ స్వప్రయోజనాల కు కానీ ప్రజలకు మేలు చేయాలని ఆలోచనలేదు. కార్మిక నగర్ చెరువు అభివృద్ధి కి జీవీఎంసీ నుండి 40లక్షల రూపాయలు మా హయంలో కేటాయిస్తే ఆ పనులు పక్కనపెట్టేసి వాళ్ళ అనుచరులతో లేఔట్ గా మార్చి భూములు దోచుకుంటున్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం అని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీఈసీ సభ్యులు పైల శ్రీనివాస్ రావు,పరవాడ జడ్పీటీసీ పైలా సన్యాసిరాజు, వై.సి.పి సీనియర్ నాయకులు చుక్క రాము నాయుడు, పరవాడ వైస్ ఎంపీపీలు బంధం నాగేశ్వరరావు ,బుస అప్పలరాజు,పరవాడ మండల పార్టీ అధ్యక్షులు కోన రామరావు,వెన్నెలపాలెం సర్పంచ్ వెన్నెల అప్పారావు,గొర్లివానిపాలెం సర్పంచ్ గొర్లె గోపి, భర్ణికం సర్పంచ్ పెద్దిశెట్టి పూజ శేఖర్, కన్నూరు ఎంపీటీసీ గొల్లవిల్లి శ్రీను, పెద్దముషిదివాడ సర్పంచ్ పల్ల అప్పారావు, వై.సి.పి ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూ ఆక్రమణదారులకు నోటీసులు అందజేత



**అనంతగిరి, (విశాఖ సమాచారమ్):-** నేషనల్ హైవేకు అనుకుని ప్రభుత్వ భూముల్లో నిర్మించుకున్న వివిధ సముదాయా దుకాణాలు కు నేషనల్ హైవే వారు తొలగించవలసిందిగా ఆయా వ్యక్తులకు నోటీస్ 6 ప్రకారంగా నోటీసులు అందజేయనున్నారు. అనంతగిరిలో మెయిన్ రోడ్ లో ఉన్న దుకాణాలన్నిటికీ నేషనల్ హైవే 516 వారు తొలగించవలసిందిగా దుకాణదారులకు నోటీసులు అందజేస్తారు అనంతగిరి మెయిన్ రోడ్ లో సుమారు 24 మంది ప్రభుత్వ భూములు ఆక్రమంగా దుకాణాలు ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు కొనసాగిస్తున్నారు నేషనల్ హైవే రావటంతో ప్రమాదాల అలాగే దూర ప్రాంతాలకు వెళ్లాలంటే ప్రయాణం సుఖాంతంగా ఉంటుందని వాహన చోదకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు నేషనల్ హైవే తొందరగా నిర్మిస్తే చాలా సంతోషమని పర్యాటక ప్రకటన ప్రకారం ఈ ప్రాంతమంతా అభివృద్ధి చెందుతాదని గిరిజనులు తెలుపుతున్నారు అలాగే హైవేలు తొందరగా నిర్మిస్తే ఇక్కడున్న భూములకు రెక్కలు వస్తాయని అలాగే ఈ ప్రాంతంలో పండిస్తున్న పంటలకు రవాణా సౌకర్యం సులువుగా ఉండటంతో నేరుగా మార్కెట్ తోనే వ్యాపారాలు చేయవచ్చని గిరిజన రైతులు వాపోతున్నారు అనంతగిరిలో 24 మంది, అలాగే కొత్తవలస ఐదుగురు, ముల్యాగూడ గ్రామంలో 48 మంది భూ అక్రమణదారులు ఉన్నారని స్థానిక ఎమ్మార్వో సిబ్బంది వీఆర్వోలు వీళ్ళందరికీ నోటీసులు జారీ చేయడం జరుగుతుందని అతి త్వరలో ఈ షాపులన్నీ ఖాళీ చేసి ప్రభుత్వానికి స్థలాన్ని అప్పజెప్పాలని ఎమ్మార్వో మాట్లాడితే తెలిపారు..

# యువ దర్శకులు విజయవంతం కావాలి

## ప్రొడక్షన్ నెంబర్ 3 పోస్టర్ ఆవిష్కరణలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** సినిమా రంగంలో నూతన టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్న యువ దర్శకులు విజయవంతం కావాలని ప్రముఖ సినీ నిర్మాత, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆకాంక్షించారు.

ఫ్యామిలీ ప్యాక్ ఎంటర్టైన్మెంట్ నిర్మాణ సారథ్యంలో, ఆర్కే మీడియా హౌస్ సహ సమర్పణలో వైజాగ్ కి చెందిన యువ దర్శకుడు రత్నం రామ్ గోపాల్ దర్శకత్వంలో రూపొందుతున్న ప్రొడక్షన్ నెంబర్ 3 చిత్రానికి సంబంధించిన పోస్టర్ని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్ బుధవారం నాడు ఆవిష్కరించారు. నూతన ఒరవడి లో చిత్రాన్ని నిర్మించి ఎంతోమంది యువ దర్శకులు విజయవంతం అయ్యారని అదే కోవలో ఈ చిత్రం కూడా భారీ విజయవంతం అవుతుందని ఆశిస్తున్నానని ఆయన అన్నారు. కళాకారులకు వైజాగ్ పుట్టినిల్లు అని ఇక్కడ నుంచే ఎంతోమంది దర్శకులు సాంకేతిక నిపుణులు రచయితలు సినిమా రంగం లో పేరు ప్రఖ్యాతలు తెచ్చుకున్నారని అన్నారు.. ఈ సందర్భంగా సినిమా బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమం లో చిత్ర దర్శకుడు రత్నం రామ్ గోపాల్, ఆర్కే మీడియా హౌస్ అధినేత బి.రవి కాంత్, సీనియర్ జర్నలిస్ట్ లఖినేని బాలకృష్ణ, కవి,రచయిత సత్తివాడ శ్రీకాంత్, సహాయ దర్శకుడు నాని,రిషి తదితరులు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన నగర మేయర్





**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** పారిశ్రామిక ప్రాంతమైన గాజువాకను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం ఆయన గాజువాక నియోజవర్గం పరిధిలోని జూన్ 6 లో 88వ వార్డులో గల యాదవ జగ్గరాజుపేట, దువ్వాడ సెక్టర్-1, ఇంద్రనగర్, మంగళ పాలెంలో పరదేశమ్మ కాలనీ, జె.ఎన్.ఎన్.యు.ఆర్.ఎమ్ కాలనీ ప్రాంతాలలో సుమారు రూ.144.51 లక్షల వ్యయంతో 88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలు తో కలిసిపలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం విశాఖ నగరాన్ని అభివృద్ధి పరిచేందుకు చర్యలు చేపట్టిందని, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు మరియు శాసనసభ్యులు సారథ్యంలో మన పారిశ్రామిక ప్రాంతమైన గాజువాకను ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందన్నారు.

ముందుగా నగర మేయర్ గాజువాక పరిధిలోని యాదవ జగ్గరాజుపేట లో రూ.19.95 లక్షల వ్యయంతో సిసి డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణానికి, దువ్వాడ సెక్టర్ 1 లో రూ.40.62 లక్షల వ్యయం తో ఖాళీ స్థలానికి ప్రహరీ గోడ నిర్మాణానికి, ఇంద్రా నగర్ రూ.43.98 లక్షల వ్యయంతో ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపనలను చేశారు. అనంతరం మంగళ పాలెం లో గల పరదేశమ్మ కాలనీలో రూ.19.98 లక్షల నిర్మించిన కమ్యూనిటీ హాల్ కు, జె.ఎన్.ఎన్.యు.ఆర్.ఎమ్ కాలనీలో రూ.19.98 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్ లను స్థానిక కార్పొరేటర్ తో కలిసి ప్రారంభోత్సవాలను చేశారు.

అనంతరం జె.ఎన్.ఎన్.యు.ఆర్.ఎమ్ కాలనీలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కాలనీ నివాసితులు, స్థానిక కార్పొరేటర్ మొల్లి ముత్యాలు మాట్లాడుతూ ఈ కాలనీలో ప్రధానంగా తాగునీటి సమస్య ఉందని, రోజు విడిచి రోజు తాగునీరు సరఫరా జరుగుచున్నదని, వీధిలైట్లు సరిగా లేనందున పాములు సంచరిస్తూ చాలా ఇబ్బందులకు గురవుతున్నామని, బస్సు సౌకర్యం కూడా సరిగాలేదని, సుమారు తొమ్మిది వేల గృహాలు ఉన్న ఈ ప్రాంత ప్రజలకు అన్ని మౌలిక వసతులతో కూడిన స్మశాన వాటికను ఏర్పాటు చేయాలని మేయర్ కు విజ్ఞప్తి చేశారు. ప్రజలకు అవసరమయ్యే మౌలిక వసతులతో పాటు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడంలో కూటమి ప్రభుత్వం ఎప్పుడూ ముందే ఉంటుందని, జె.ఎన్.ఎన్.యు.ఆర్.ఎమ్ కాలనీ ప్రజలకు అవసరమగు మౌలిక సదుపాయాలను తాగునీటిని, వీధి దీపాలను, స్మశాన వాటిక ఏర్పాటుకు అధికారులతో కలిసి చర్చించి వెంటనే కార్యాచరణ చేపడతామని మేయర్ నివాసితులకు తెలిపారు.


ఈ కార్యక్రమంలోజోనల్ కమిషనర్ బి ఆర్ ఎస్ శేషాద్రి, కార్యనిర్వాహక ఇంజనీర్ ఎం. ఆర్.ఎస్. అప్పారావు, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు, సహాయక ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# అతిథి అధ్యాపకుల సమస్యలను ప్రభుత్వం దృష్టిలో ఉంచుతా: కలెక్టర్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** అతిథి అధ్యాపకుల సమస్యలను మరియు నెలవారి జీతాలు సంబంధించి విషయాలను ప్రభుత్వం దృష్టి కీ తీసుకువెళ్తానని విశాఖపట్నం కలెక్టర్ తనను కలిసిన అతిథి అధ్యాపకుల సంఘం సభ్యులను ఉద్దేశించి తెలిపారు. రూల్స్ కి వ్యతిరేకంగా యూనివర్సిటీలో నియమించబడిన టీచింగ్ సభ్యులను అందరిని కూడా పంపించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని తెలియజేశారు. అదే రకంగా వికలాంగులకు 4 పర్సెంట్ రిజర్వేషన్ యూనివర్సిటీలో అమలు జరిగేలా మరియు వర్టికల్ విధానం అమలయ్యేలా చూడాలని సభ్యులు కోరారు అదే రకంగా మహిళలకు నోటిఫికేషన్ లో రోస్టర్ పాయింట్లను గుర్తించే విధంగా చూడాలని ఈ సందర్భంగా కలెక్టర్ గారిని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు డాక్టర్ ఎం సురేష్ మీనన్, డాక్టర్ దాస్, డాక్టర్ శిరీష్, డాక్టర్ సురేంద్ర, డాక్టర్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నా క్యాంటీన్ సందర్శించిన ఎమ్మెల్యే విజయచంద్ర దంపతులు



**పార్వతిపురం, (విశాఖ సమాచారమ్):-** ఎన్డీఏ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పార్వతీపురంలోని అన్నా క్యాంటీన్ ను స్థానిక శాసనసభ్యులు బోనెల విజయచంద్ర, శ్రీమతి అనూష దంపతులు బుధవారం మధ్యాహ్నం సందర్శించారు. అన్న క్యాంటీన్ వాతావరణ స్థితిగతులు వంటకాలు పరిశీలించారు. అన్న క్యాంటీన్లో ఆహారం తీసుకుంటున్న ప్రజలతో మాట్లాడి భోజనం రుచి శుభ్రత తదితర విషయాలపై ఆరా తీశారు. ప్రజలకు గౌరవభావంతో ఆహారం సరఫరా చేయాలని వివాదాలు లేకుండా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

# కళ్యాణోత్సవాలకు పోర్టు వెంకన్న దేవస్థానం ముస్తాబు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** పోర్టు ఏరియాలోని శ్రీ శృంగమణి పర్వతంపై వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి తిరుక్క ళ్యాణ మహోత్సవాలకు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం ముస్తాబైంది. ఈనెల 6 నుండి 12వ తేదీ వరకు శ్రీవారి కళ్యాణ వేడుకలు ఘనంగా జరుగుతాయని ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎస్. శ్రీనివాసరావు తెలియజేశారు. స్వామివారి కల్యాణోత్సవం 7వ తేదీ సాయంత్రం 7గంటలకు జరుగుతుంది.8వ తేదీ సాయంత్రం 6 గంటలకు గరుడ వాహనంపై స్వామివారి తిరువీధి సేవ నిర్వహిస్తారు.9వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు పండిత గోష్టి మహదాశీర్వచన ఉంటుంది. 10వ తేదీ సాయంత్రం 5 గంటలకు శ్రీ స్వామి వారి తెప్పోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని మేళ తాళాలు మంగళ వాయిద్యాలతో పైలెట్ లాంచీలో సముద్రంలో ఊరేగిస్తారు. 11వ తేదీ ఉదయం ఎనిమిది గంటలకు సముద్ర స్నానం,అన్నదానం ఉంటుంది సాయంత్రం 6 గంటలకు చోరోత్సవం,12వ తేదీ సాయంత్రం 6 గంటలకు పుష్పాంజలి సేవ ఉంటుంది. 22వ తేదీన 16రోజుల పండుగ పాలికా విసర్జనంతో ఉత్సవాలు ముగుస్తాయి. శ్రీ స్వామివారి కళ్యాణ వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించి తరించాలని ఈఓ శ్రీనివాసరావు కోరారు. ఈ ఉత్సవాలను ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభిస్తారు.



2nd pages.qxd 6/4/2025 8:15 PM Page 4






# ప్లాస్టిక్ భూతం.. చేయాలి అంతం

## నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

2025లో జరిగే ప్రపంచ పర్యావరణ దినోత్సవం ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడంపై దృష్టి పెట్టింది. రిపబ్లిక్ ఆఫ్ కొరియా ప్రపంచ వేడుకలను నిర్వహిస్తోంది. దశాబ్దాలుగా, ప్లాస్టిక్ కాలుష్యం ప్రపంచంలోని ప్రతి మూలలోకి చొరబడి, మనం తాగే నీటిలోకి, తినే ఆహారంలోకి , మన శరీరాల్లోకి చొరబడుతోంది. ప్లాస్టిక్ కాలుష్యం ఒక ప్రధాన ఆందోళన అయినప్పటికీ, ఇది నేటి పర్యావరణ సవాళ్లలో అత్యంత పరిష్కరించదగిన వాటిలో ఒకటి, దీనికి కొన్ని స్పష్టమైన పరిష్కారాలు అందుబాటులో ఉన్నాయి.

ఈ సంవత్సరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం యునెప్ నేతృత్వంలోని బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్ లో చేరి , ప్రపంచవ్యాప్తంగా ఉన్న సమాజాలను పరిష్కారాలను అమలు చేయడానిక, వాటి కోసం వాదించడానికి సమీకరించనుంది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం ప్లాస్టిక్ కాలుష్య ప్రభావాలపై పెరుగుతున్న శాస్త్రీయ ఆధారాలను హైలెట్ చేస్తుంది. ప్లాస్టిక్ వాడకాన్ని తిరస్కరించడం, తగ్గించడం, తిరిగి ఉపయోగించడం, రీసైకిల్ చేయడం, పునరాలోచించడం వంటి వాటికి ఊతం ఇస్తుంది. ప్రపంచ ప్లాస్టిక్ కాలుష్య ఒప్పందం ద్వారా ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడానికి 2022 లో చేసిన ప్రపంచ నిబద్ధతను కూడా ఇది బలోపేతం చేస్తుంది.

**ఆతిథ్య దేశం గురించి**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం కోసం ప్రపంచవ్యాప్తంగా పరిశీలనలను నిర్వహిస్తున్న కొరియా రిపబ్లిక్ ఇది రెండోసారి. ఇది మొదటిసారిగా 1997లో " భూమిపై జీవితం కోసం " అనే ఇతివృత్తంతో ఈ దినోత్సవాన్ని నిర్వహించింది. గత 28 సంవత్సరాలుగా, దేశం నీరు , గాలి నాణ్యతను మెరుగుపరచడంలో, రసాయనాలను సురక్షితంగా నిర్వహించడంలో , పర్యావరణ వ్యవస్థలను రక్షించడంలో, పునరుద్ధరించడంలో అద్భుతమైన పురోగతిని సాధించింది. నేడు, విస్తరించిన ఉత్పత్తిదారుల బాధ్యత ద్వారా వ్యాపారాలను నిమగ్నం చేయడంలో దశాబ్దాల అనుభవాన్ని పెంపొందించుకుంటూ, ప్లాస్టిక్ వ్యర్థాలను పరిష్కరించడానికి ప్రయత్నాలకు నాయకత్వం వహిస్తున్న దేశాలలో రిపబ్లిక్ ఆఫ్ కొరియా ఒకటి. దేశం యొక్క పూర్తి జీవిత-చక్ర ప్లాస్టిక్ వ్యూహం ప్లాస్టిక్‌ల జీవిత చక్రంలో ఉత్పత్తి, రూపకల్పన నుండి వినియోగం, పునర్వినియోగం మరియు రీసైక్లింగ్ వరకు ప్రతి దశను పరిష్కరించడం లక్ష్యంగా పెట్టుకుంది. ప్లాస్టిక్‌లను ఎలా ఉపయోగించాలో, పారవేయాలో పునర్నిర్మించడానికి ఈ వ్యూహం ప్రభుత్వం, వ్యాపారాలు వినియోగదారులను ఒకచోట చేర్చుతుంది. వ్యర్థాలను దాని మూలం వద్ద తిరిగి ఉపయోగించడాన్ని నిర్ధారించడం అవసరం. అలాగే, కొరియా రిపబ్లిక్‌లో డిస్పోజబుల్ కప్ డిపాజిట్ వ్యవస్థను ప్రవేశపెట్టిన మొదటి ప్రావిన్స్ జెజు.

**2025 థీమ్ గురించి..**

ప్లాస్టిక్ కాలుష్యం ట్రిపుల్ ప్లానెటరీ సంక్షోభం ప్రాణాంతక ప్రభావాలను మరింత తీవ్రతరం చేస్తుంది. వాతావరణ మార్పు సంక్షోభం , ప్రకృతి సంక్షోభం , భూమి మరియు జీవవైవిధ్య నష్టం కాలుష్యం, వ్యర్థాల సంక్షోభం . ప్రపంచవ్యాప్తంగా,



అరికట్టడం, రీసైక్లింగ్ ప్రయత్నాలను విస్తరించడం, వృత్తాకార ఆర్థిక వ్యవస్థకు పరివర్తనను వేగవంతం చేయడం ద్వారా, ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడానిక, మరింత స్థిరమైన భవిష్యత్తును నిర్మించడానికి కొరియా రిపబ్లిక్ నిర్ణయాత్మక చర్య తీసుకుంటోంది.

ప్రపంచ పర్యావరణ దినోత్సవానికి ఆతిథ్య ప్రదేశంగా కొరియా రిపబ్లిక్‌లోని జెజు ప్రావిన్స్ ఎంపికైంది. 2022లో, ఈ ప్రావిన్స్ 2040 నాటికి ప్లాస్టిక్ కాలుష్యం లేకుండా మారాలనే దార్శనికతను ప్రకటించింది . దేశంలో గృహ వ్యర్థాలను నియమించబడిన రీసైక్లింగ్ మద్దతు కేంద్రాలలో తప్పనిసరిగా పారవేయాల్సిన ఏకైక ప్రావిన్స్ జెజు. ఈ వ్యవస్థకు మూలం నుండి వ్యర్థాలను వేరు చేయడం, అధిక రీసైక్లింగ్ రేట్లను పెంచడం, ఎక్కువ వ్యర్థాలను ప్రతి సంవత్సరం 11 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు జల పర్యావరణ వ్యవస్థల్లోకి లీక్ అవుతాయని అంచనా వేయబడిరది, వ్యవసాయ ఉత్పత్తులలో ప్లాస్టిక్‌లను ఉపయోగించడం వల్ల మురుగునీరు మరియు పల్లపు ప్రాంతాల నుండి మైక్రోప్లాస్టిక్‌లు నేలలో పేరుకుపోతాయి. ప్లాస్టిక్ కాలుష్యం వార్షిక సామాజిక, పర్యావరణ వ్యయం 300 బిలియన్ డాలర్ల నుండి 600 బిలియన్ డాలర్ల మధ్య ఉంటుంది. సముద్ర పర్యావరణంతో సహా ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడానికి ప్రపంచ ఒప్పందాన్ని సాధించే దిశగా దేశాలు పురోగతి సాధిస్తున్న తరుణంలో ఈ సంవత్సరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకుంటున్నారు . నవంబర్ 2024లో, రిపబ్లిక్ ఆఫ్ కొరియా ప్లాస్టిక్ కాలుష్య ఒప్పందాన్ని అభివృద్ధి చేయడానికి ఐదవ చర్చల సమావేశాన్ని నిర్వహించింది. ఈ సెషన్ యొక్క రెండవ భాగం ఆగస్టు 5 నుండి 14 వరకు స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో జరుగుతుంది.

## 'చివరకు మిగిలేది' రహస్యం చెప్పిన బుచ్చిబాబు

### చిరస్మరణీయులు



బుచ్చిబాబు ప్రసిద్ధ నవలా కారుడు. నాటకకర్త. కథకుడు. ఆయన రాసిన ఏకైక నవల"చివరకు మిగిలేది"తో జీవితం సత్యాలు తెలిపారు. 'చివరికి మిగిలేది' అనే దానికి సమాధానం తెలిస్తే జీవితరహస్యం తెలుసుకున్నట్లే. ఈ నవల కథాంశం పై సినిమా కూడా వచ్చింది. ఇది మనోవైజ్ఞానిక నవల. జీవితానికి సంబంధించిన అనేక ప్రశ్నలను ఈ నవల రేకెత్తిస్తుందని సాహిత్యకారుల అభిప్రాయం. కథంతా నాయకుడు దయానిధి తాత్విక కోణంలో నడుస్తుంది. నవలలోని ప్రతి పాత్రను మనో విశ్లేషణ చేసుకుంటూపోతాడు. తల్లి గురించి గ్రామస్తులు పలు రకాలుగా మాట్లాడుకోవడంతో అతను సంఘానికి దూరంగా ఏకాంతంగా గడుపుతాడు. నలుగురు మహిళలు అతని జీవితంలోకి వచ్చినా అమృతం సన్నిహితురాలవుతుంది. ఈ నవల ద్వారా రచయిత " మానవునికి కావాల్సింది మతాలు, దేవుళ్లు కాదు, మెక్కుబళ్లు, రాజకీయాలు కాదు, దయ కొంచెమైనా ఉండాలని " చెప్పాడు. "వ్యక్తిని కాదు ద్వేషించాల్సింది, అతనిలోని దౌర్బల్యాన్ని, బలహీనతలను అన్న మానవతా సిద్ధాంతం పై అని" ముగింపు ఇచ్చాడు. ఆయన 82 కథలు, 40 వ్యాసాలు, నవల, వచన కావ్యం, 40 నాటికి, నాటకాలు తదితరాలు రాసాడు.

బుచ్చిబాబు ఏలూరులో 1916జూన్ 14న సూర్యప్రకాశరావు, వెంకాయమ్మ లకు జన్మించాడు. అక్షరాభ్యాసం కంకిపాడు లో జరిగింది. పాలకొల్లులో ఎస్ఎస్ ఎల్సీ ,బీఏ గుంటూరులో చదివారు. సుబ్బలక్ష్మి ని పెళ్లి చేసుకున్నారు. అనంతపురం, విశాఖలో ఆంగ్ల ఉపన్యాసకుడుగా పని చేసారు. 1945-67 వరకూ ఆకాశవాణిలో పనిచేసారు. 1967 సెప్టెంబర్ 20న మరణించారు. మేడమెట్లు కథా సంపుటిలో రాసిన కథలు ఆయన కు మంచిపేరు తెచ్చాయి. స్వాతంత్ర్య పోరాటం జరుగుతున్న సమ యంలో కవులందరూ మార్క్సిస్టు భావజాలం, లేదా సంఘసంస్కరణ ఉద్యమానికి చెందినవారుగా ఉన్న కాలంలో అతి కొద్దిమంది అభ్యుదయ రచయితల్లో బుచ్చిబాబుని అగ్రగణ్యుణుగా చెప్పవచ్చు.

బుచ్చిబాబు అనే కలం పేరుతో, సంతోష్ కుమార్ పేరుతో ఆంగ్ల రచనలు చేసారు, ఆయన అసలు పేరు శివరాజు వెంకట సుబ్బారావు. 1936 లో ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో బీఏ చదువుతున్నప్పుడు జువెనిలియా, బ్రోకెన్ వయోలిన్ ఆంగ్ల కవితలు, 'పశ్చాత్తాపం లేదు ' తెలుగు కథానిక కళాశాల వార్షిక సంచికలో ప్రచురితం అయ్యాయి. ఆంగ్ల సాహిత్యంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసారు. ఆయన రాసిన చిన్న కథలు పొడవైనవి అయినా పాత్ర చిత్రీకరణ, నేరేషన్ లో విస్పష్టమైన శైలి కలిగి ఉంటాయి. ఆయనపై ఆంగ్ల రచయితలు సోమర్సెట్ మామ్, ఓ హెన్రీ వంటి వారి ప్రభావం ఉంది. ఒకేఒక నవల రాసినా మంచి పేరు లభించింది.

**యం.వి.రామారావు, 8074129668**

## 'శూన్యం'లో శబ్దాల శోధన




"శూన్యం" అనేది చాలా లోతైన భావన. శూన్యత అంటే పూర్వస్థితి, అస్థిత్వ రాహిత్యం వంటి భావనలను సూచిస్తుంది.

సాహిత్యంలో, "శూన్యం" అనేది ఒక ఆంతర్య స్థితి %-% భావనల క్షీణత, విరహం, ఖాళీతనం, అర్థశూన్యత వంటి భావనల ప్రతీకగా నిలుస్తుంది.

"శూన్యం" సమకాలీన సంఘటనలు, సాహిత్య భావోద్వేగాలు, వ్యక్తిగత అనుభవాలను కలిపిన వచన కవితా సంపుటి.

కవి ఫిజిక్స్ అరుణ్ కుమార్ వివిధ అంశాలపై తన దృక్పథాన్ని సహజమైన భాషలో, చక్కటి వ్యంగ్యంతో, మనస్సుని తాకే రీతిలో వ్యక్తీకరించారు.

ఈ పుస్తకాన్ని రవీంద్రనాథ్ ఠాగూర్, సి.వి.రామన్ వంటి ఇద్దరు మహనీయులకు అంకితం చేయడం ఎంతో ప్రత్యేకం.

ఈ సంపుటిలో "ఆగస్ట్ 23, 2023", బ్లాక్ హోల్, గ్లోబల్ వార్మింగ్, ప్లానెట్ వర్సెస్ ప్లాస్టిక్, అంతరిక్షపు కలలు, మోడ్రన్ సొసైటీ, మే 13 సెలవు దినం కాదు వంటి విభిన్న శీర్షికల కవితలు ఉన్నాయి. ఇవి రాజకీయ%-%సామాజిక పరిస్థితులు, వ్యక్తిగత భావోద్వేగాలు, సాహిత్య రంగంలోని న్యాయం%-%అన్యాయాన్ని ప్రతిబింబిస్తాయి.

డాక్టర్ వెనిగళ్ళ రాంబాబు గారు చెప్పినట్లుగా, శాస్త్రం-సాహిత్యం రెండు విభిన్న ధ్రువాల్లాంటివైనా, కవి ఫిజిక్స్ అరుణ్ కుమార్ ఈ రెండింటినీ సమన్వయపరిచి, ఒకే పడవను రెండు తెడ్లతో నడిపిస్తున్న విధానం ప్రశంసనీయం.

**కొన్ని కవితలను పరిశీలిద్దాం**

"మే 13 సెలవు దినం కాదు" అనే కవితలో

"అమ్మ" అనే ప్రతీకను జీవనదాతగా, ఓటుతో దేశానికి ప్రాణం పోసే దేవతగా చిత్రీకరించడం హృదయాన్ని తాకుతుంది.

"సేవకులే నాయకులు కావాలి... ప్రజల్ని గెలిపించే పార్టీలు కావాలి" అనే వాక్యాల ద్వారా సమకాలీన రాజకీయ అస్తవ్యస్థతల మధ్య ప్రజాస్వామ్య విలువలను పునఃస్థాపించాలని కోరుకుంటున్నట్లు తెలుస్తుంది.

"చరిత్రకు నువ్వే ఒక ట్యాగ్ లైన్" అనే కవితలో

"జయమో అపజయమో రేపోకటి ఉందని" వంటి పంక్తులు జీవితంపై బలమైన తాత్విక దృష్టిని ప్రతిబింబిస్తాయి.

"ప్రపంచాన్ని పట్టించుకోకుండానే గమ్యం చేరే వరకు ప్రయాణించు" వంటి వాక్యాలు ఓటమిని భయపడే వారికి ధైర్యాన్ని నూరు పోస్తాయి.

రామానుజం, ఐన్‌స్టీన్, విక్రమ్ ల్యాండర్ వంటి ఉదాహరణల ద్వారా - సమాజం ఎలా మొదట తిరస్కరించి, చివరికి అంగీకరించిందో చక్కగా చెప్పారు.

"అమ్మ జాతీయ జెండాను ముద్దాడింది" అనే కవితలో


కవి ఒక యుద్ధవీరుడి తల్లిదండ్రుల మనోభావాలు, దేశభక్తి, త్యాగాన్ని అద్భుతంగా వ్యక్తీకరించారు.

"అమ్మ జాతీయ జెండాను ముద్దాడింది" అనే పంక్తిలో తల్లి ప్రేమ, గౌరవం, దేశభక్తి అన్నీ ఒకే మాటలో కలిసిపోయాయి.

కొడుకు దేశానికి సేవ చేయడానికి వెళ్తాడు - తల్లి కన్నీళ్లను పక్కన పెట్టి ఆశీర్వదిస్తుంది. కానీ చివరికి అతను "మూటలో ముద్దలా" తిరిగివస్తాడు - ఇది అత్యంత ఉద్వేగభరితమైన చిత్రణ.

"తన తల్లి కంటిలో వెలుగునే చూశారా జనం" అనే వాక్యంలో, కన్నీళ్ల వెనుక దాగి ఉన్న గర్వాన్ని, తల్లి త్యాగాన్ని రచయిత ఎంతో నిశితంగా పసిగట్టారు.

"భరతమాత నిశ్శబ్దంగా యుద్ధం చేస్తోంది" అనే వాక్యం కేవలం సైనిక యుద్ధాన్ని మాత్రమే కాక, భావితరాల భవిష్యత్తు కోసం జరుగుతున్న సామాజిక, సాంస్కృతిక పోరాటాన్నీ సూచిస్తుంది.




**మొత్తం మీద**

ఈ పుస్తకంలోని కవితలు కవి తనదైన శైలిలో - వ్యంగ్యం, గంభీరత, మానవీయత సమపాళ్లలో మలిచారు.

సునిశితమైన వ్యాఖ్యానాలు, సూటి ప్రశ్నల ద్వారా ఆయన సామాజిక అవగాహనను చాటుకున్నారు.

పుస్తక ముఖచిత్రం నుంచి శీర్షికల వరకు ఒక సృజనాత్మక దృష్టికోణం స్పష్టంగా కనిపిస్తుంది.

కొన్ని చోట్ల గట్టి భావాలు వాడినా అవి సూటిగా చెప్పబడ్డాయి. కవిత్వానికి తగిన కవితాత్మకత (చిత్రణ, అలంకారాలు) కొద్దిగా ముదురితే భావప్రబలత మరింత పెరుగుతుంది అనిపించింది.

ఈ పుస్తకం ఒక తాత్విక, విమర్శనాత్మక, మరియు వ్యక్తిగత ప్రయాణం. ఇది సామాన్య పాఠకులకే కాకుండా, సాహిత్యంపై ఆసక్తి ఉన్నవారికి గొప్ప మార్గదర్శకంగా నిలుస్తుంది.

రచయిత చూపిన విశ్లేషణాత్మక దృష్టికోణం, హృదయాన్ని తాకే భావ వ్యక్తీకరణ ఈ పుస్తకాన్ని ప్రత్యేకంగా నిలబెడతాయి.

భవిష్యత్తులో మరెన్నో కవితా సంపుటాలు మీ నుంచి రావాలని ఆకాంక్షిస్తూ శుభాభినందనలు!



**జ్యోతి మువ్వల**
**9008083344**

## బట్టతల.. కొన్ని ఆసక్తికరమైన విషయాలు



ఉత్తర ఆఫ్రికా దేశాలలో, బట్టతల అనేది పురుషత్వానికి చిహ్నంగా పరిగణిస్తారు.

తుర్క్ మెనిస్తాన్‌లో, మగాడికి బట్టతల ఉంటే, అతను ఒకటి కంటే ఎక్కువ మంది భార్యలను వివాహం చేసుకోవడానికి అనుమతి ఉంది.

బ్రెజిల్‌లో, ఒక స్త్రీకి తన కాబోయే భర్తకు బాగా ఒత్తుగా జుట్టు ఉండకుండా చూసుకోవడానికి హక్కు ఉంది. ఎందుకంటే ఒత్తుగా ఉండే జుట్టును స్త్రీత్వానికి, ఒత్తుగా జుట్టు లేకపోవడాన్ని పురుషత్వానికి చిహ్నంగా భావిస్తారు.

ఉజ్బెకిస్తాన్‌లో, బట్టతల పురుషులు కన్యాశుల్కం చెల్లించకుండా వివాహం చేసుకుంటారు.

అర్జెంటీనాలో, బట్టతల పురుషులను వివాహం చేసుకునే స్త్రీలను వారి గ్రామ నాయకులుగా పరిగణిస్తారు.

ఇండోనేషియాలో, బట్టతల జంటలు వివాహ ఒప్పందంపై సంతకం చేస్తున్న న్యాయమూర్తి వద్దకు వచ్చినప్పుడు, న్యాయమూర్తి వారితో ఫోటో తీసుకుంటారు. ఆయన దానిని ఒక విజయంగా భావిస్తాడు.

ఆస్ట్రేలియాలో, భార్యకు బట్టతల ఉన్న ప్రేమికుడు దొరికితే, తన జుట్టు ఒత్తుగా ఉన్న భర్తకు విడాకులు ఇచ్చే హక్కు ఉంది.

ఫిన్లాండ్‌లో, హెల్సింకి విశ్వవిద్యాలయంలో ఒక విద్యార్థినికి చదువుకోవడానికి అనుమతి పొందితే, ఆమె చదువుకుని గ్రాడ్యుయేట్ కావడం ప్రధానం కాదు. బదులుగా ఆమె ఉద్దేశం బట్టతల ఉన్న విద్యార్థితో ప్రేమలో పడటం ముఖ్యమవుతుందట.

ప్రపంచంలో అత్యధిక బట్టతల శాతం ఉన్న దేశం స్పెయిన్. అక్కడ దాదాపు 44.5 శాతం మంది పురుషులు బట్టతల కలిగి ఉన్నారు. ఆ తర్వాత ఇటలీ (44.37శాతం), ఫ్రాన్స్ (44.25శాతం), యునైటెడ్ స్టేట్స్ (42.68శాతం), జర్మనీ (41.51శాతం) ఉన్నాయి.

పరిశోధన ప్రకారం తెలిసిందేమిటంటే, పురుషులలో బట్టతల రావడానికి కారణం ఎక్కువ పురుష హార్మోన్ల స్రావం, బట్టతల ఉన్నవారు సగటు వ్యక్తి కంటే మేధోపరంగా పరిణతి చెందుతారని!!

పురుషులలో 95 శాతం జుట్టు రాలడం ఆండ్రోజెనెటిక్ అలోపేసియా వల్ల వస్తుంది, దీనిని "మగ ప్యాటర్న్ బట్టతల" అని కూడా పిలుస్తారు. ఇది టెస్టోస్టెరాన్‌లోని డైహైడ్రోటెస్టోస్టెరాన్ (DHT) అనే ఉప ఉత్పత్తికి జన్యు సున్నితత్వం వల్ల కలిగే వారసత్వ లక్షణం. DHT-సెన్సిటివ్ హెయిర్ ఫోలికల్స్ కాలక్రమేణా కుంచించుకుపోతాయి, ఫోలికల్స్ జుట్టు ఉత్పత్తిని పూర్తిగా ఆపివేస్తుంది.

వయసు పెరిగే కొద్దీ బట్టతల వచ్చే అవకాశం పెరుగుతుంది. ఎందుకంటే వయసు పెరిగే కొద్దీ టెస్టోస్టెరాన్ %ణు%గా మారుతుంది. కాబట్టి జుట్టు రాలిపోతుంది

ఆహారం కూడా ఒక కారణం కావచ్చు. చెక్ వంటకాల్లో సూప్‌లు, మాంసం వంటకాలు, పిండి పదార్థాలు, బీర్లు ఎక్కువగా ఉంటాయి. ఈ ఆహారాలలో జుట్టు పెరుగుదలకు అవసరమైన విటమిన్లు, ఖనిజాలు అధిక మొత్తంలో ఉండే అవకాశం చాలా తక్కువ.

**- యామిజాల జగదీశ్**

## రేఖలను పోలిన రేఖలు ఉండవు



ఈశ్వరుడి లీలా అపారమైనది మనిషి శరీరంలోని వేళ్లపై ఉన్న చర్మం మీద రేఖలు రూపుదిద్దుకోవడం, శిశువు తల్లిగర్భంలో సుమారు నాలుగు నెలల వయసు ఉన్నప్పుడే ప్రారంభమవుతుంది. ఆ సమయంలో ఈ రేఖలు మాంసంపై జాలంలా...అంటే వలయంలా ఏర్పడతాయి. ఈ రేఖల ఏర్పాటుకు సమాచారం డిఎన్ఎ ద్వారా లభిస్తుంది. కానీ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఈ రేఖలు ఎటువంటి పరిస్థితుల్లోనూ ఆ శిశువు తల్లి లేదా తండ్రి లేదా ప్రపంచంలోని ఏ ఇతర వ్యక్తితోనూ సరిపోవు. ఈ రేఖలను సృష్టించేవాడు కూడా అంతే ప్రత్యేకమైన పరమాత్మనే, ఎందుకంటే ఈ లోకంలో ఉన్నవారి, ఇంకా ఈ లోకంలో లేనివారి చేతి,నుదుటి రేఖలను కూడా ఆయన రూపకల్పన చేస్తాడు, వాటి ప్రతి ఒక్క డిజైన్‌ను గుర్తుంచుకుంటాడు. కాబట్టి ప్రతిసారి ఆయన తన వేళ్లపై కొత్త రకమైన రూపాన్ని ఏర్పాటు చేస్తూ తన అద్భుతాన్ని చూపిస్తాడు. ఆశ్చర్యకరంగా, వేళ్ల రేఖలు కాలిపోవడం, గాయ పడడం లేదా ఏదైనా కారణంగా నాశనం కావడం జరిగినా, అవి మళ్లీ అదే నిర్మాణంతో తిరిగి వస్తాయి ు అందులో ఒక చుక్క కూడా భిన్నంగా ఉండదు. ఈ సమస్తాన్ని నిర్వహిస్తున్న ఒక అద్భుతమైన శక్తి ఉంది, అదే ఈ ప్రపంచాన్ని నడుపుతోంది. ఆ పరమాత్మ మొదటగా మన హస్తరేఖలను సృష్టించాడు ు ఇవే నేడు మన ఆధార్ కార్డు రూపంలో మన గుర్తింపుకి ఆధారంగా మారాయి... అతడే శక్తిశాలి భగవాన్...అతడే పరమేశ్వరుడు... అతడే సూక్ష్మంలో సూక్ష్మమైనవాడు, అనంతంలో అనంతమైన బ్రహ్మాండం.

### పంచాంగం

**గురువారం 5-6-2025**
**శ్రీ విశ్వావసు నామ సంవత్సరము**
**ఉత్తరాణాయణం, గ్రీష్మ రుతువు**
**జ్యేష్ఠ మాసం**

| | |
|---|---|
| తిథి | : శు. దశమి రా. 2.16 |
| నక్షత్రం | : హస్త పూర్తి |
| వర్జ్యం | : మ. 1.05 ల 2.50 |

## మీ కలాన్ని సంధించండి

కథలు, కవితలు, సాహిత్య, రాజకీయ విశ్లేషణలు, వ్యాసాలు, ప్రత్యేక కథనాలు, సందర్భోచిత కథనాలు... ఇలా ఏదైనా సరే.. రాసే ఆసక్తి ఉన్న వారు పంపవచ్చు. మీకు 'విశాఖ సమాచారమ్' దినపత్రిక చక్కటి వేదికగా నిలుస్తుంది. బాగున్న రచనలను మీ పేరు , ఫోటోతో సహా ప్రచురిస్తాము.

**మీ రచనలు పంపించవలసిన ఈమెయిల్ అడ్రస్**
**vspnews4@gmail.com**
**వాట్సాప్ నంబర్ : 9100986585.**

# కంబాలకొండను సందర్శించిన ఎంపీ శ్రీభరత్

**సింగపూర్ మాండై వైల్డ్ లైఫ్ ప్రతినిధులతో కలిసి అభివృద్ధి కార్యక్రమాలను సమీక్ష**



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** విశాఖపట్నం లోని కంబాలకొండ అభయారణ్యాన్ని పార్లమెంట్ సభ్యుడు శ్రీ మత్తుకుమిల్లి శ్రీభరత్ గారు సందర్శించారు. సింగపూర్‌కు చెందిన మాండై వైల్డ్ లైఫ్ ప్రతినిధులు కూడా ఈ సందర్శనలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అభయారణ్యంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఎంపీ శ్రీభరత్ సమీక్షించారు. మాండై ప్రతినిధులకు కంబాలకొండ లో జరుగుతున్న పర్యావరణ పరిరక్షణ, పర్యాటక అభివృద్ధి, తదితర కార్యక్రమాల గురించి వివరించారు.

అభయారణ్యం పరిరక్షణ మరియు సమగ్ర అభివృద్ధిపై మాండై ప్రతినిధులు పలు విలువైన సూచనలు చేశారు. ఈ సూచనలను ఎంపీ శ్రీభరత్ సహా ఫారెస్ట్ మరియు జూ అధికారులు గమనించారు.

ఈ సందర్శనలో విశాఖ ఫారెస్ట్ శాఖ అధికారులు, జూ అధికారులు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు పర్యాటకాన్ని పురోగతి దిశగా తీసుకెళ్లే విధంగా కంబాలకొండ అభివృద్ధి కొనసాగుతుందని ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు.

# గోవా సీఎంను కలిసిన గంటా



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** బీచ్ టూరిజం అధ్యయనం కోసం గోవా వెళ్లిన భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆ రాష్ట్ర సీఎం ప్రమోద్ సావంత్, టూరిజం శాఖ మంత్రి రోహన్ ఖవుంటే లతో సోమవారం సమావేశమయ్యారు. టూరిస్టుల స్వర్గధామంగా భావించే గోవాలో విజయవంతంగా నడుస్తున్న పర్యాటక ప్రాజెక్టులను గురించి తెలుసుకున్నారు. ముఖ్యంగా బీచ్ టూరిజం అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు.. ఆ రంగంలో వస్తున్న కొత్త కొత్త ప్రాజెక్టులు.. తదితర అంశాల గురించి చర్చించారు. సువిశాలమైన బీచ్ ఉన్న విశాఖ, భీమిలిలలో ఆయా ప్రాజెక్టుల అమలు అవకాశాలు వివరించారు. టూరిజం అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెద్ద పీట వేస్తున్నారని, టూరిజానికి పరిశ్రమ హోదా ఇవ్వడం ద్వారా అనేక రాయితీలు, ప్రోత్సాహకాలు ఇస్తున్నామని తెలిపారు. చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతుందని గోవా సీఎం పేర్కొన్నారు.

# గోల్డ్ మెడల్, ఎండోమెంట్ స్కాలర్షిప్ కు విరాళం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** ఆంధ్ర విశ్వవిద్యాలయం నావెల్ ఆర్కిటెక్చర్ విభాగంలో రాజ్-టి ఏ ఐ గోల్డ్ మెడల్ ఏర్పాటు చేయడానికి మూడు లక్షల రూపాయల విరాళాన్ని, శిరి అండ్ అనిల్ రాజ్ ఎండోమెంట్ స్కాలర్షిప్ ఏర్పాటు చేయడానికి 7,50,000 విరాళాన్ని టెక్నాలజీ అసోసియేట్స్ సంస్థ విరాళాన్ని అందించింది. విరాళానికి సంబంధించిన డీడీలను టిఎఐ ఇంజనీర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ జానకి రామన్ గణేషన్ ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి రాజశేఖర్ సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనుంజయరావుకు అందజేశారు.

నేవల్ ఆర్కిటెక్చర్, మెరైన్ ఇంజనీరింగ్ విభాగంలో ప్రతిభ చూపిన విద్యార్థికి గోల్డ్ మెడల్ ను బహుకరించాలని, అదేవిధంగా విద్యలో ప్రతిభ చూపుతూ ఆర్థిక సహాయం అవసరమైన విద్యార్థికి స్కాలర్షిప్ ను బహుకరించాలని దాతలు కోరారు.

ఈ సందర్భంగా వీసీ ఆచార్య జి.పి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహిస్తూ బంగారు పతకం, స్కాలర్షిప్ కు అవసరమైన నిధులను అందించిన దాతలను అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులకు స్ఫూర్తిని కలిగిస్తాయని అన్నారు. వీటితోపాటు విద్యార్థులకు నైపుణ్యతను పెంపొందించడానికి అవసరమైన ఇంటర్న్ షిప్ లు అందించాలని కోరారు. భవిష్యత్తులో సైతం ఇదే విధమైన సహాయాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయానికి అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ. ఎన్ ధనుంజయరావు పాల్గొన్నారు.

# వెన్నుపోటు పాలనకి చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధం!

**41వార్డులో "వెన్నుపోటు దినం" భారీ ర్యాలీ**

**కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తిన కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్**



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** ఏడాది కూటమి వెన్నుపోటు, అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడడానికి సిద్ధంగా ఉన్నారని 41 వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్ఆర్ సీపీ క్లస్టర్ ఇంచార్జ్ కోడిగుడ్ల శ్రీధర్ అన్నారు. జిల్లా అధ్యక్షులు కేకే రాజు ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో జరిగిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి 41వ వార్డు నుండి 500 మంది కార్యకర్తలతో కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ సమక్షంలో భారీ ర్యాలీ చేపట్టి విజయవంతం చేశారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్ లు మాట్లాడుతూ అధికారం కోసం అమలు కానీ హామీలు ఇచ్చి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రజలకు వెన్నుపోటు పొడిచారని దుయ్యబట్టారు. 50 సంవత్సరాలకే పెన్షన్, ఇంట్లో ప్రతి స్కూల్ విద్యార్థికి 15000 రూపాయలు, యువతకు నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు, వంటి సూపర్ సిక్స్ హామీలు ఏ ఒక్కటీ అమలు చెయ్యలేకపోయారన్నారు. ఆనాడు జగన్మోహన్ రెడ్డి సబ్సిడీతో ఇంటింటికి రేషన్ అందించే 9,800 వాహనాలను ఇస్తే వాటిని చంద్రబాబు నిలిపివేసి పరోక్షంగా 60 వేల మందికి పొట్ట కొట్టారన్నారు. జగన్ చేసిన మంచి కనపడకూడదని మళ్లీ పాత విధానాన్ని తీసుకువచ్చి రేషన్ దుకాణాల్లో లైన్లో కాసే విధంగా మహిళల ఆత్మ అభిమానం పై దెబ్బ కొట్టారన్నారు. పాకిస్థాన్ పై మహిళ సింధూర్ పేరిట చేసిన యుద్ధం భారత్ లో విజయవంతం అయితే, ఇక్కడ ఆంధ్రప్రదేశ్లో మహిళల ఆత్మవిమానంపై దెబ్బ కొడుతున్న చంద్రబాబు ప్రభుత్వాన్ని కూడా ప్రజలు యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వాన్ని గద్దె దింపాలని చూస్తున్నారన్నారు. మళ్లీ జగన్మోహన్ రెడ్డి సుపరి పాలనను ప్రజలు కోరుకుంటున్నారని కోడిగుడ్ల పూర్ణిమా శ్రీధర్ తెలియజేశారు. రెడ్ బుక్కు రాజ్యాంగాన్ని పక్కనపెట్టి ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో 41 వ వార్డు వైఎస్ఆర్సిపి నాయకులు వేలంగిని రావు, కుమార్, శ్రీను, మహిళా నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు జరగనున్న వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్నీ విజయవంతం చేయాలని 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు కోడిగుడ్ల శ్రీధర్ పిలుపునిచ్చారు. జ్ఞానపురం జంక్షన్ నుండి జిల్లా వైఎస్ఆర్సిపి నిరసన వరకు భారీగా కార్యకర్తలు, అభిమానులందరూ హాజరుకావాలన్నారు. అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం 12 నెలల కాలంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచింది అన్నారు. ముఖ్యంగా మహిళలకు ఉచిత బస్సులు, తల్లికి వందనం, యువతకు నిరుద్యోగ భృతి, 50 ఏళ్లకే పెన్షన్ వంటి అనేక హామీలు ఇచ్చి మోసం చేశారన్నారు. సూపర్ సిక్స్ పేరుతో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కలిసి ఆడిన డ్రామాలు తేటతెల్లమైపోయాయన్నారు. విసిగిపోయిన ప్రజలు మళ్లీ జగనన్న ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్లు తెలిపారు.

# ప్రజల భాగస్వామ్యంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యం

● పర్యావరణహితంగా మన జీవన విధానం ఉండాలి ● వైస్ చాన్సలర్ ప్రొఫెసర్. జి. పి రాజశేఖర్ ● పర్యావరణ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** ప్రజలందరి భాగస్వామ్యంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.పి రాజశేఖర్ అన్నారులి . జూన్ 5 ఏయు విద్యా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే పర్యావరణ దినోత్సవ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ను ఈరోజు ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ హితంగా మన జీవన విధానాన్ని మలచుకోవాలని సూచించారు.

భవిష్యత్తులో ఉపాధ్యాయులుగా నిలిచే బి.ఈ.డి, ఎంఈడి విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యతను ఇవ్వాలని సూచించారు. తద్వారా వారు పాఠశాల స్థాయి నుంచి చిన్నారులలో పర్యావరణ స్పృహను పెంపొందించడం. సంరక్షించే బాధ్యతను వారికి అందించడం జరుగుతుందని చెప్పారు. పర్యావరణ పరిరక్షణ ద్వారా మాత్రమే మానవ మనుగడ సాధ్యపడుతుందనే విషయాన్ని ప్రజలు అర్థం చేసుకొని తదనగుణంగా నడుచుకోవాలని సూచించారు.

విద్యా విభాగాధిపతి ఆచార్య టి. షారోన్ రాజు మాట్లాడుతూ పర్యావరణంలో అనేక జీవులు, వృక్షాలు పరస్పరం సహకారంతో ముందుకు సాగుతాయని చెప్పారు. వీటన్నింటిని సంరక్షించడం, పరిరక్షించడం భవిష్యత్ తరాలకు అందించడం మన అందరి బాధ్యత అని చెప్పారు. ముఖ్యంగా ఉపాధ్యాయులుగా మారే బీఈడీ ఎంఈడి విద్యార్థులకు ఈ దిశగా అవగాహన కల్పించడం జరుగుతుందని అన్నారు. ప్రతి సంవత్సరం విభాగం ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవాన్ని జరుగుతున్నట్లు తెలిపారు. పర్యావరణ శాస్త్ర నిపుణులతో ప్రత్యేక ప్రసంగాలను ఏర్పాటు చేసి పర్యావరణ ప్రాముఖ్యతను వివరించడం జరుగుతుందని అన్నారు. మన చుట్టూ ఉన్న పర్యావరణాన్ని పరిరక్షించుకునే బాధ్యతను, వృక్షాలను నాటి సంరక్షించే బాధ్యతను ప్రతి విద్యార్థి స్వీకరించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ దిశగా మనం వేసి ప్రతి అడుగు భవిష్యత్ తరాలకు ముందడుగుగా నిలుస్తుందని అన్నారు. నేల సారాన్ని పెంపొందించడం, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ఎంతో అవసరమని చెప్పారు.

అదేవిదంగా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన అమ్మ పేరుతో ఒక మొక్క సందేశాన్ని విస్తృతంగా ప్రజల్లోనికి తీసుకువెళ్లాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశించిన విధంగా కోటి మొక్కలు నాటాలననే సంకల్పంలో ప్రతి వ్యక్తి భాగస్వామి కావాలని అన్నారు. మానవ జీవితం ప్రకృతితో మమేకమై ముందుకు సాగాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం. వీలైనంతవరకు ప్రకృతి హిత వస్తువులను ఉపయోగించడం ఎంతో అవసరమని చెప్పాడు. సరళ జీవన విధానాన్ని అలవర్చుకోవాలని చెప్పారు.

ఈ కార్యక్రమంలో విభాగాచార్యులు ప్రకాష్, డాక్టర్ ఆలీ, డాక్టర్ ప్రవీణా దేవి, పరిశోధకులు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం సంవత్సరం అయిన సందర్భంగా బాలలకు పుస్తకాల పంపిణీ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** మంగళవారం సీతంపేటలో గల జనసేన పార్టీ నగరకార్యాలయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఒక సంత్సరం అయినా సందర్భంగా 27 వార్డ్ జనసేన పార్టీ అధ్యక్షులు గుండు సురేష్ బాబు (చంటి ) గారి ఆధ్వర్యంలో 50 మంది బాల విద్యార్థులకు పుస్తకాలు పంపిణి చేసారు, అనంతరం వైస్సార్సీపీ దుష్ట పాలన అంతమై నేటికీ ఒక సంత్సరం పూర్తియి ప్రజలకు సుస్థిరపాలన అందించే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తునందున ఆనందోత్సవాలతో జనసేన నగర పార్టీ కార్యాలయంలో మీటాయిలు పంచారు.

అలాగే ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం శ్రీ పవన్ కళ్యాణ్ గారి పిలుపు మేరకు ఈ రోజు సూపరిపాలన మొదలై ఏడాది అనే కార్యక్రమం వాడవాడల దీపావళి, సంక్రాంతి ఒకేసారి వచ్చేలా కూటమి శ్రేణులు ప్రజలం దరు పండుగ చేసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన సౌత్ ఇంచార్జి శివప్రసాద్ రెడ్డి, జనసేన నాయకులు మద్రివేముల శ్రీనివాసరావు, 34 వార్డ్ ఇంచార్జి నారా నాగేశ్వరావు, 35 వార్డ్ ఇంచార్జి కోసూరి శ్రీనివాస్, వీరామహిళ లలిత, 27 వార్డ్ జనసేన నాయకులు సతీష్,పెద్ద రాజు, గణేష్, రాజేష్, మరియు 27 వార్డ్ జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మూడు దశాబ్దాల ప్రేమమయ సేవా పరంపర




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** ఉక్కునగరం శ్రీ సత్యసాయి సేవా సమితి నిర్వహిస్తున్న చలివేంద్ర సేవ గత 30 సంవత్సరాలుగా సుస్థిరంగా సాగుతూ, పగటిపూట ఎండ వేడిని తట్టుకుంటూ ప్రయాణించే జనులకు ప్రేమతో అందించబడే ఈ నీరు, మజ్జిగ అనేవి నేరుగా భగవంతుని ప్రేమను సూచి స్తున్నట్లు అనిపించేస్తున్నాయి.

ఈ సేవను ప్రత్యేకతను కలిగించేది ఒక కుటుంబం మొత్తం ప్రతి రోజు ఈ సేవలో పాల్గొనడం. ప్రతి రోజు వారి కుటుంబ సభ్యులు ఒకటిగా వచ్చి భక్తి భావంతో, వినయంగా నీరు మరియు మజ్జిగను అందజేస్తున్నారు. ఇది భగవాన్ శ్రీ సత్యసాయి బాబా ప్రభోదించిన "Love All - Serve All" అనే సూత్రాన్ని జీవితం లో ఆచరించడం.

ఈ రోజు ఉక్కునగరం సమితి సీనియర్ భక్తులు, సమితి కన్వీనర్ జి. రామకృష్ణ, తన సతీమణి అమ్ములుతో కలిసి ఈ రోజు చలివేంద్ర సేవలో పాల్గొన్నారు. ఈ సేవ ఈనాటి యువతకు ఆదర్శంగా నిలుస్తుంది.

ఈ సేవలో తమ కుటుంబ సభ్యులతో కలసి పాల్గొనడం భగవంతుని అనుగ్రహంగా ఉక్కునగరం శ్రీ సత్యసాయి భక్తులు భావిస్తారు.

# విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

## డీఎస్సీ కరెంట్ ఎఫైర్స్

**16 మే**

**జ్ఞానపీఠ్ పురస్కారం స్వీకరించిన గుల్జార్, రామభద్రాచార్య**

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మే 16న 2023వ సంవత్సరానికి జ్ఞానపీఠ్ పురస్కారాన్ని ప్రముఖ కవి, సినీ గేయరచయిత గుల్జార్‌కు, సంస్కృత పండితుడు జగద్గురు రామభద్రాచార్యకు అందజేశారు. గుల్జార్ అసలు పేరు సంపూర్ణ సింగ్ కాలరా. హిందీ సినిమాల్లో గొప్ప గేయరచయితగా పేరు తెచ్చుకున్నారు. అద్భుతమైన ఉర్దూకవుల్లో ఒకరిగా పేరుంది. అనారోగ్య కారణాలతో ఈ కార్యక్రమానికి గుల్జార్ హాజరుకాలేకపోయారు.

75 ఏళ్ల జగద్గురు రామభద్రాచార్య చిత్రకూట్‌లోని తులసీ పీఠ్ వ్యవస్థాపకుడు. ప్రముఖ హిందూ ఆధ్యాత్మిక గురువు, సంస్కృత పండితుడు. 240కు పైగా గ్రంథాలు రాశారు. ఆయన రాష్ట్రపతి చేతుల మీదుగా నగదు పురస్కారం, సరస్వతి కాంస్య విగ్రహం అందుకున్నారు. సాహిత్యానికి, సమాజానికి రామభద్రాచార్య చేసిన సేవలను ముర్ము కొనియాడారు.

**11 మే**

**ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ డి. రఘునాథరావుకు జీవిత సాఫల్య పురస్కారం**

ఐఐసీటీ, అకాడమీ ఫర్ సైన్స్, టెక్నాలజీ అండ్ కమ్యూనికేషన్ (ఏఎస్‌టీసీ), నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఇండియా(ఎన్ఏఎస్ఐ) హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో ఐఐసీటీ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా ఏఎస్‌టీసీ జీవిత సాఫల్య పురస్కారాన్ని అందుకున్నారు.

**07 మే**

**బిజుకు రష్యా సాహస పురస్కారం**

కళింగ వీరుడిగా మన్ననలందుకున్న బిజు బాబుకు రష్యా సాహస పురస్కారం ప్రకటించింది. ధైర్య సాహసాలకు ప్రతీకగా నిలిచిన ఆయన భారత స్వాతంత్ర్య సంగ్రామంలోనే కాకుండా ఇండోనేసియా విముక్తి ఉద్యమంలోనూ చురుగ్గా పాల్గొన్నారు. 'భూమిపుత్రుడి'గా ఇండోనేసియా గతంలోనే ఆయనను సత్కరించింది.

రెండో ప్రపంచ యుద్ధంలో బిజుబాబు రష్యాకు సహకరించినందుకు మే 6న దిల్లీలోని రష్యా రాయబారి కార్యాలయంలో నిర్వహించిన సంస్మరణ సమావేశంలో ఆయనకు సాహస పురస్కారం ప్రదానం చేశారు. బిజు తరఫున ఆయన కుమారుడు, ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పురస్కారాన్ని స్వీకరించారు.

**06 మే**

**హైదరాబాద్ నార్కొటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్‌కు డబ్ల్యూపీఎస్ పురస్కారం**

దుబాయ్ పోలీసులు మే 13 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించే వరల్డ్ పోలీస్ సమ్మిట్ (డబ్ల్యూపీఎస్) 2025లో 'ఎక్సలెన్స్ ఇన్ యాంటీ నార్కొటిక్' విభాగంలో హైదరాబాద్ నార్కొటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్(హెచ్‌న్యూ)కు మొదటి స్థానం దక్కింది. ఈ వరల్డ్ పోలీసు సమ్మిట్‌లో 138 దేశాల నుంచి ప్రముఖ అధికారులు సమావేశమవుతారు.

ఈ ఏడాది 'ఎక్సలెన్స్ ఇన్ యాంటీ నార్కొటిక్' విభాగానికి సంబంధించి జరిగిన వర్చువల్ సమావేశంలో పాల్గొన్న హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ సమగ్ర ప్రజంటేషన్ ఇచ్చారు. హెచ్‌న్యూ పాటిస్తున్న ఉత్తమ విధానాల పట్ల ఆకర్షితులైన డబ్ల్యూపీఎస్ న్యాయ నిర్ణేతలు ఈ పురస్కారానికి ఎంపిక చేశారు.

**05 మే**

**పులిట్జర్ పురస్కారం**

పాత్రికేయ రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే పులిట్జర్ పురస్కారాలను 2025, మే 5న ప్రకటించారు. న్యూయార్క్ టైమ్స్‌కు నాలుగు, న్యూయార్కర్‌కు మూడు పురస్కారాలు లభించాయి. పులిట్జర్ ప్రతిష్ఠాత్మక పబ్లిక్ సర్వీస్ మెడల్ వరుసగా రెండోసారి 'ప్రో పబ్లికా'కు దక్కింది. అమెరికాలో కఠిన అబార్షన్ చట్టాలు ఉన్న రాష్ట్రాల్లో అత్యవసర వైద్య సహాయం అందించడంలో వైద్యులు ఆలస్యం చేయడంతో మహిళలు మరణించడంపై కథనాలు అందించినందుకుగాను 'ప్రో పబ్లికా' పాత్రికేయులు కవిత సురానా, లిజ్జీ ప్రెస్సర్, కసాండ్రా జరమిలో, స్టేసీ క్రానిట్జ్‌లకు పురస్కారం లభించింది.

ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 2024 ఎన్నికల ప్రచారం సందర్భంగా హత్యాయత్నం నుంచి త్రుటిలో తప్పించుకున్న ఘటనకు సంబంధించిన కవరేజీకి వాషింగ్టన్ పోస్ట్‌కు పురస్కారం లభించింది. ఇందుకు సంబంధించిన ఫొటోలు అందించిన ఫొటో పాత్రికేయుడు డగ్ మిల్స్‌కు బ్రేకింగ్ న్యూస్ విభాగంలో అవార్డు లభించింది.

ప్రతిష్ఠాత్మక పులిట్జర్ సాహిత్య పురస్కారాన్ని పెర్సీవల్ ఎవరెట్ రాసిన 'జేమ్స్' పుస్తకానికి ప్రకటించారు.

**02 మే**

**ఉత్తమ మహిళా ప్లేయర్‌గా సౌమ్య గుగులోత్**

**తెలంగాణ నుంచి ఈ అవార్డు అందుకున్న తొలి అమ్మాయి**

తెలంగాణ అమ్మాయి సౌమ్య గుగులోత్ ఈ ఏడాది అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) ఉత్తమ మహిళా ప్లేయర్‌గా నిలిచింది. ఇండియన్ ఉమెన్స్ లీగ్‌లో ఈస్ట్ బెంగాల్‌కు ఆడిన సౌమ్య.. 9 గోల్స్ సాధించింది. ఆఖరి మ్యాచ్‌లో 42వ నిమిషంలో గోల్ కొట్టిన ఈ స్ట్రైకర్.. జట్టును గెలిపించింది. ఏఐఎఫ్ఎఫ్ ఉత్తమ క్రీడాకారిణి అవార్డు అందుకున్న తొలి తెలంగాణ అమ్మాయి సౌమ్యనే.

పురుషుల విభాగంలో సుభాషిష్ బోస్ 'ఉత్తమ ప్లేయర్'గా ఎంపికయ్యాడు. బోస్ నాయకత్వంలోని మోహన్‌బగాన్ జట్టు ఐఎస్ఎల్ కప్‌తో పాటు లీగ్ విన్నర్స్ షీల్డ్‌నూ గెలుచుకుంది. 2020-21లో ముంబయి సిటీ తర్వాత.. ఒకే సీజన్లో ఈ రెండు ట్రోఫీలు గెలిచిన ఘనత మోహన్‌బగాన్‌దే.

**01 మే**

**మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డు**

**అందుకున్న భారత స్టార్ డబుల్స్ ఆటగాళ్లు సాత్విక్, చిరాగ్**

దేశ అత్యున్నత క్రీడా పురస్కారం మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డు (2023)ను భారత స్టార్ డబుల్స్ ఆటగాళ్లు సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి అందుకున్నారు. మే 1న కేంద్ర క్రీడల మంత్రి మాన్‌సుఖ్ మాండవీయ వారికి పురస్కారాన్ని ప్రదానం చేశారు. నిరుడు ఖేల్‌రత్న పురస్కారానికి ఎంపికైన సాత్విక్, చిరాగ్‌లు విదేశాల్లో టోర్నీలు ఉండటంతో రాష్ట్రపతి భవన్‌లో అవార్డులు అందుకోలేకపోయారు.

**- డా.పి.వి.రామ్, ఎం.ఏ, బి.ఈడి, పి.హెచ్.డి**

**విశాఖ సమాచారమ్ 9553574250**

## గోదావరి జిల్లాల సమాచారమ్

## సిద్ధేశ్వరి పీఠం ఉత్తరాధికారిగా సూర్య అరవింద్



**తుని, (విశాఖ సమాచారమ్):–** తమిళనాడులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరి పీఠం ఉత్తరాధికారిగా తునికి చెందిన డాక్టర్ కాదంబరి సూర్య అరవింద్ నియమితులయ్యారు. ఆయన సోదరుడు కాదంబరి రామకృష్ణ ఈ విషయం తెలిపారు. అరవింద్ చిన్నప్పటి నుంచీ ఆధ్యాత్మిక చింతన, భక్తి భావనతో ఉండేవాడని, ఎంబీబీఎస్ చదివి, శ్రీ సిద్ధేశ్వరి పీఠంలో చేరారని చెప్పారు. భక్తిశ్రద్ధలతో సేవలందించిన అరవింద్‌కు పీఠాధిపతి, జగద్గురువు సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి.. దత్తేశ్వరానంద భారతి స్వామిగా సన్యాస నామం ఇచ్చి, ఉత్తరాధికారిగా నియమించారని వివరించారు. ఈ నెల 6న కుర్తాళంలో ఆయన పట్టాభిషేకం జరుగుతుందని తెలిపారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన



**మలకపల్లి, (విశాఖ సమాచారమ్)**
**నియోజకవర్గ బ్యూరో ఇంచార్జ్ కొల్లి చిన్నబాబు) :** ప్రభుత్వ పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కార్మికులుగా పనిచేస్తున్న వంట వారు, సహాయకులు బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మలకపల్లి నందు జరిగిన ఒకరోజు శిక్షణా కార్యక్రమంలో నిరసన గళం వినిపించారు. ఈ సందర్భంగా శిక్షణ కొద్దీ సేపు బహిష్కరించి ధర్నా నిర్వహించారు. బయటి మార్కెట్లో ధరలు విపరీతంగా పెరిగాయని అన్నారు. గ్యాస్ బండలు ప్రభుత్వమే సరఫరా చేయాలని, జీతాలు పెంచాలని, జీతాలు, కుకింగ్ సొమ్ము ప్రభుత్వం చాలా ఆలస్యంగా చెల్లిస్తుందని అందువల్ల వడ్డీల భారం భరంచలేక పోతున్నామన్నారు. అందువల్ల ఈ సమస్యలన్నింటినీ ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో కోదాటి భాగ్యవతి,కృష్ణ కుమారి, భవాని, ఎస్ సీత, బి వెంకటలక్ష్మి తదితరులు ఉన్నారు.

## బాణసంచా పేలుడు కేసులో 10 ఏళ్ల జైలు



**రాజమహేంద్రవరం, (విశాఖ సమాచారమ్):–** అనధికారికంగా బాణసంచా నిల్వ ఉంచి ముగ్గురి మృతికి కారణమైన ఘటనలో దేవాడ ముత్యాలరెడ్డికి 10 ఏళ్ల జైలు శిక్ష, రూ.31,500 జరిమానా విధిస్తూ సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ అండ్ సెషన్ కోర్టు జడ్జి ప్రకాశ్‌బాబు మంగళవారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో 6 సంవత్సరాల 6 నెలలు జైలు శిక్ష అనుభవించాలని తీర్పునిచ్చారు. లాలాచెరువు, సుబ్బారావుపేటలో దీపావళి సామానులు తయారు చేసేందుకు మందుగుండు సామగ్రి అనధికారికంగా నిల్వ ఉంచారు. 2018 సెప్టెంబర్ 22న నిల్వ ఉంచిన మందుగుండు పేలి ముగ్గురు మృతి చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో అప్పటి సీఐ సూర్యభాస్కర్ కేసు నమోదు చేశారు. దీనిపై వాదనలు పూర్తయి, నిజనిర్ధారణ కావడంతో ముత్యాలరెడ్డికి శిక్ష వి?ధిస్తూ తీర్పు నిచ్చారు.

## కూలీలు పస్తులుంటే.. యోగాలో నిమగ్నమా!

**భీమవరం అర్బన్, (విశాఖ సమాచారమ్):–** గత రెండు నెలలుగా ఉపాధి హామీ కూలీలు వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతుంటే.. అధికారులందరూ ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాలో నిమగ్నమైపోవడం దారుణమని సీఐటీయూ నాయకులు మండిపడ్డారు. భీమవరం మండలంలోని గూట్లపాడు, గొల్లవానితిప్ప గ్రామాల్లో మంగళవారం సీఐటీయూ సంఘం సభ్యులు పర్యటించి ఉపాధి హామీ కూలీలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకుని ప్రభుత్వ వైఖరిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు ఎం.ఆంజనేయులు, ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీ పనులు చేసిన 15 రోజుల్లోనే వేతనాలు చెల్లించాలని చట్టంలో ఉన్నా రెండు నెలలు గడుస్తున్నా వేతనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. నిత్యావసర ధరలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే యోగాసనాల్లో అధికారులు నిమగ్నమైపోవడం బాధాకరమన్నారు. ఉపాధి హామీ రోజు కూలీ రూ.600 చేసి ఏడాదికి 200 పనిదినాలకు పెంచాలని డిమాండ్ చేశారు.

# కాపులపై కేసులను తిరగతోడడం కక్ష సాధింపే

## ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు



**అమలాపురం, (విశాఖ సమాచారమ్):–** కాపులపై కోర్టు కొట్టేసిన కేసులను ఇప్పుడు తిరగతోడడం అంటే కేవలం కక్ష సాధింపు అని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ఆరోపించారు. కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభంపై ఉన్న ద్వేషంతోనే చంద్రబాబు ప్రభుత్వం ఈ కుట్రకు తెరతీస్తోందని స్పష్టం చేశారు. అమలాపురం హైస్కూలు సెంటరులో గల తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపులకు విద్య, ఉద్యోగ, ఉపాధి పరంగా రిజర్వేషన్ల కోసం ముద్రగడతోపాటు అనేకమంది కాపు నాయకులు ఉద్యమించారని గుర్తు చేశారు. కేవలం ముద్రగడపై కక్ష సాధింపు కోసం కేసులను తిరగతోడే ప్రయత్నం చేస్తున్న కూటమి ప్రభుత్వం అందుకు ప్రతికూల ఫలితం పొందక తప్పదని ఆయన స్పష్టం చేశారు. 2023లో కాపులపై కేసులను విజయవాడ రైల్వే కోర్టు కొట్టివేస్తే ఇప్పుడు ఈ కేసులపై హైకోర్టులో అప్పీల్ దాఖలు చేయాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం వెనుక కక్ష సాధింపు అనే కుట్ర దాగి ఉందని ఎమ్మెల్సీ అన్నారు. ముద్రగడ కాపుల కోసం చేసిన ఉద్యమాలన్నీ గాంధేయ మార్గంలోనే చేశారని, ఆయనపై చంద్రబాబు ప్రభుత్వం అనేక కేసులు నమోదు చేయడమే పెద్ద తప్పు అయితే ఇప్పుడు కోర్టు కొట్టేసిన కేసులను తిరగతోడాలనుకోవడం మరో అతి పెద్ద తప్పు అన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాపులు, శెట్టిబలిజల మైత్రీ బంధం బలంతో టీడీపీకి గట్టిగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

# పింఛన్ తీసేసి బతికుండగానే చంపేస్తున్నారు

**పిఠాపురం, (విశాఖ సమాచారమ్):–** 'వృద్ధాప్య పింఛనే ఇప్పటివరకు నన్ను బతికించింది. ఇప్పుడు ఆ పింఛన్ కూడా ఆపేసి ఏవో కారణాలు చెబుతున్నారు. నేను బతికున్నట్టు నిరూపించుకోమంటున్నారు. నేను కాలు కదపలేను. ఎక్కడికీ వెళ్లలేను. పింఛన్ లేకపోతే నాకు దిక్కులేదు. దాన్ని కూడా తీసేసి బతికుండగానే చంపేస్తున్నారు' అంటూ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఇలాకాలో 85 ఏళ్ల అవ్వ కన్నీటిపర్యంతమైంది.

కాకినాడ జిల్లా పిఠాపురం డ్రైవర్స్ కాలనీకి చెందిన చోడిశెట్టి సుబ్బారావు(85) కొన్నేళ్లుగా వృద్ధాప్య పింఛన్ అందుకుంటూ.. కుమార్తె పార్వతి వద్ద నివసిస్తోంది. వైఎస్ జగన్ సర్కార్‌లో ఎలాంటి ఇబ్బంది లేకుండా వలంటీర్ ద్వారా ఇంటి వద్దే పింఛన్ అందుకున్న ఆమెకు కూటమి ప్రభుత్వంలో కష్టాలు ఎదురయ్యాయి. ఈ నెల పింఛన్‌ను ఆపేసిన కూటమి సర్కార్.. బతికున్నట్లుగా నిరూపించుకోవాలంటూ ఆమెకు అగ్ని పరీక్ష పెట్టింది. దీంతో తనను ఆదుకోవాలంటూ ఆ వృద్ధురాలు విలపిస్తోంది.

**నేను బతికే ఉన్నా కదా..**

'గతంలో ఏ ఇబ్బంది లేకుండా వలంటీరే అన్నీ చూసుకునేవాడు. ఇప్పుడు ఎవరూ రావట్లేదు. వృద్ధాప్యం వల్ల వేలిముద్రలు పడడం లేదంటున్నారు. నా కళ్లు మసకబారడంతో ఐరిస్ కూడా పడటం లేదంటున్నారు. ఏది పడకపోయినా నేను బతికే ఉన్నా కదా. నాకు పింఛనే ఆధారం అని చెబుతున్నా ఎవరూ కనికరించడం లేదు. నాకు పింఛనైనా ఇప్పించండి లేదా నన్ను చంపేయండి' అంటూ వృద్ధురాలు విలపించింది. 'మా అమ్మకు నెలనెలా వచ్చే పింఛన్ డబ్బులతోనే మందులు కొంటున్నా. పవన్‌కళ్యాణ్‌కు ఓటు వేసినందుకు ఇప్పుడు పింఛన్ గురించి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది' అంటూ ఆమె కుమార్తె పార్వతి వాపోయింది. తమకు న్యాయం చేయాలని కోరింది.



# వంకర పాదాలు సరి చేయొచ్చు




**కాకినాడ, (విశాఖ సమాచారమ్):–** పుట్టుకతో వచ్చే వంకర పాదాలను సరి చేయవచ్చని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ్ (ఆర్‌బీఎస్‌కే) జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ వి.అరుణ తెలిపారు. వరల్డ్ క్లబ్ ఫుట్ డే సందర్భంగా కాకినాడ జీజీహెచ్ ఆర్థోపెడిక్ లెక్చర్ గ్యాలరీలో డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ (డీఈఐసీ), క్యూర్ ఇండియా సంయుక్త ఆధ్వర్యాన మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ, పుట్టుకతో వంకర పాదాలను గుర్తిస్తే వైద్యులు, సామాన్యులు జీజీహెచ్‌లో ఉన్న డీఈఐసీకి సిఫారసు చేయాలని సూచించారు. ఆర్థోపెడిక్స్ విభాగాధిపతి డాక్టర్ ఎంపీఆర్ విఠల్ మాట్లాడుతూ, పుట్టిన 21 రోజుల్లోగా చికిత్స అందించగలిగితే వంకర పాదాలు పూర్తిగా నయమయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఆర్థోపెడిక్, ఫిజియోథెరపీ నిపుణుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే చికిత్సా విధానాల ద్వారా శిశువు జీవన ప్రమాణాలు మెరుగు పడతాయన్నారు. అవసరానికి అనుగుణంగా టినోటమీ అనే మైనర్ శస్త్రచికిత్స నిర్వహిస్తామని డాక్టర్ విఠల్ అన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లలు, తల్లిదండ్రులతో పాటు, క్యూర్ ఇండియా ప్రతినిధులు, డీఈఐసీ సిబ్బంది, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్స్, ఫిజియోథెరపీ నిపుణులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం, వరల్డ్ క్లబ్ ఫుట్ డే సందర్భంగా డాక్టర్ విఠల్ కేక్ కట్ చేసి, పిల్లలకు అందించారు.

# రాష్ట్రంలో మద్యం, గంజాయి పాలన

**ఆకివీడు, (విశాఖ సమాచారమ్):–** రాష్ట్రంలో గంజాయి, మద్యం ఏరులైపారడంతో మహిళలు, చిన్నారులకు రక్షణ లేకుండా పోయిందని వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేశాయి. స్థానికంగా చిన్నారిపై అఘాయిత్యాన్ని ఖండిస్తూ మంగళవారం నేతలు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, మండల, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు నంద్యాల సీతారామయ్య, అంబటి రమేష్, మెప్మా మాజీ అధ్యక్షురాలు మోరా జ్యోతిరెడ్డి, కోఆప్షన్ సభ్యురాలు గుండుగొలను సావిత్రి, ధనరాజు మాట్లాడుతూ ఏడేళ్ల చిన్నారిపై అత్యాచార సంఘటన అమానవీయమన్నారు. టీడీపీకి చెందిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మహిళలకు, చిన్నారులకు రక్షణ కల్పించాలంటే పట్టణ, గ్రామాలకు దూరంగా మద్యం షాపులు ఉండాలన్నారు. బెల్టు షాపుల బెల్టు ఎప్పుడు తీస్తారని ప్రశ్నించారు. గంజాయి అమ్మకాలపై పోలీస్ యంత్రాంగం తీవ్ర నిర్లిప్తతతో ఉందన్నారు. పట్టణంలోని విచ్చలవిడిగా గంజాయి, మద్యం దొరుకుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ విప్ పడాల శ్రీనివాసరెడ్డి, గేదెల అప్పారావు, దొడ్డి జగదీష్, తిరుమానేని జగన్, కిషోర్‌రెడ్డి, మోరా శ్రీనివాసరెడ్డి, కుంకట్ల దానయ్య పాల్గొన్నారు.



## పీఎం సూర్యఘర్‌కు సహకరించాలి

**కాకినాడ సిటీ, (విశాఖ సమాచారమ్):–** పీఎం సూర్యఘర్ పథకం కింద లబ్ధిదారుల ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్ ప్యానల్ ఏర్పాటుకు అధికారులు, బ్యాంకర్లు చొరవ చూపాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదేశించారు. వివిధ అంశాలపై కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. పీఎం సూర్యఘర్ పథకం కింద రిజిస్ట్రేషన్ చేసుకున్న వారందరికీ సకాలంలో సోలార్ రూఫ్‌టాప్ ప్యానల్ ఏర్పాటు చేయాలన్నారు. సోలార్ రూఫ్‌టాప్ ప్యానల్ ఏర్పాటుకు బ్యాంకర్ల ద్వారా రుణ మంజూరులో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. దీనికోసం జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, వారం వారం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, ప్రక్రియ సజావుగా సాగేలా చూస్తామని చెప్పారు. మండలాలు, పట్టణాల వారీగా సోలార్ రూఫ్‌టాప్ ప్యానెల్ ఏర్పాటు చేసే వారితో డీఆర్‌డీఏ, మెప్మా సిబ్బంది సమన్వయం చేసుకొని, లబ్ధిదారులతో సమావేశాలు ఏర్పాటు చేసి, రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ జి.ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ జి.శ్రీనివాసరావు, ఎల్‌డీఎం సీహెచ్‌ఎస్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.

### కాకినాడలో కలకలం

## ఒకే గదిలో తల్లి, కుమారుడి మృతదేహాలు

**కాకినాడ, (విశాఖ సమాచారమ్):–** నగరంలోని రేచర్లపేటలో ఒకే గదిలో తల్లి, కుమారుడి మృతి కలకలం రేపింది. వివాహిత రమ్యదీప్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానిస్తున్నారు. మృతిచెందిన ఆమె నాలుగేళ్ల కుమారుడు ప్రశాంత్ కాళ్లు, చేతులు, నోరు, ముక్కుకు ప్లాస్టర్లు ఉన్నాయి. రెండు నెలల క్రితం రమ్యదీప్తి అబుదాబి నుంచి వచ్చారు. ఆమె భర్త శరత్‌బాబు ప్రస్తుతం గల్ఫ్‌లోనే ఉంటున్నారు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. 0

## డిపో సీఐ దురుసు ప్రవర్తనపై నిరసన

**ఏలూరు, (విశాఖ సమాచారమ్):–** ఏపీపీఎస్ ఆర్టీసీ ఏలూరు డిపో ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి డి.ఆంజనేయులుపై డిపో సీఐ దురుసు ప్రవర్తనకు నిరసనగా మంగళవారం స్థానిక ఆర్టీసీ గ్యారేజీ ఎదుట యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. యూనియన్ ఏలూరు డిపో గౌరవ అధ్యక్షుడు వై.శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంజనేయులు పట్ల సీఐ అలా ప్రవర్తించడం సరైంది కాదన్నారు. యూనియన్ నాయకులు, కమిటీ సభ్యుల పట్ల ఆర్టీసీ అధికారులు సూపర్‌వైజర్ చిన్న చూపు చూస్తున్నారని ఆరోపించారు. వెహికల్ కండిషన్ మెరుగుపరచాలని పదేపదే మేనేజ్‌మెంట్‌కు చెప్పినా ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని తెలిపారు. డిపోలో కనీస మౌలిక వసతులు లేవని అన్నారు. ఆంజనేయులు మాట్లాడుతూ సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాడుతామని, బుధవారం నుంచి నాన్ కోపరేషన్ పాటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ డిపో నాయకులు వీఎస్ నారాయణ, ఎండి రమేష్, పీకేబీ రాజు, పి.శ్రీహరి పాల్గొన్నారు.

## కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్య

**భీమడోలు, (విశాఖ సమాచారమ్):–** దుద్దేపూడి పంచాయతీ పరిధిలోని అన్నేవారిగూడెం గ్రామానికి చెందిన అన్నేపు దుర్గాప్రసాద్ (35) కడుపు నొప్పి తాళలేక పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మద్యానికి బానిసైన దుర్గాప్రసాద్ కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. మంగళవారం ఒక్కసారిగా విపరీతంగా కడుపు నొప్పి రావడంతో తట్టుకోలేక పురుగు మందును సేవించి మృతి చెందాడు. ఆతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసుగా నమోదు చేస్తున్నట్లు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.

# ఇద్దరు లారీ డ్రైవర్ల దుర్మరణం



**తాళ్లపూడి/కొవ్వూరు, (విశాఖ సమాచారమ్):–** కొవ్వూరు మండలం కాపవరం వద్ద హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు లారీ డ్రైవర్లు మృతి చెందారు. కొవ్వూరు ఎస్సై శ్రీహరిరావు తెలిపిన వివరాల ప్రకారం లారీ డ్రైవర్ బత్తుల శీనయ్య(40) హైదరాబాద్ నుంచి మండపేటకు ధాన్యం లోడుతో వస్తున్నాడు. కాపవరం వద్దకు వచ్చే సరికి కునుకుపాటుకు గురై ముందు వెళుతున్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొట్టి అనంతరం రోడ్డు డివైడర్‌ను ఢీ కొట్టడంతో లారీ ఆగిపోయింది. ఈ లారీని ఇతర వాహనాలకు ఢీకొనకుండా, శీనయ్య కిందకు దిగి డైరెక్షన్ ఇస్తూ దారి చూపుతున్నాడు. ఇంతలో జంగారెడ్డిగూడెం నుంచి ధాన్యం లోడుతో వస్తున్న మరో లారీ.. శీనయ్య లారీని బలంగా ఢీకొట్టడంతో అందులోని డ్రైవర్ కొయ్యే బాబూరావు(40) లారీ క్యాబిన్లో ఇరుకుపోయి మృతి చెందాడు. డైరెక్షన్ ఇస్తున్న బత్తుల శీనయ్య కూడా ఐచర్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. మృతదేహాలను కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై శ్రీహరి తెలిపారు.

## సచివాలయ సెక్రటరీపై ఫిర్యాదు



**రాజమహేంద్రవరం, (విశాఖ సమాచారమ్):–** రాజానగరం మండలం రాధేయపాలెం గ్రామ సచివాలయంలో జయబున్నీసా బేగం గ్రేడ్–5 హెూదాలో సెక్రటరీగా పనిచేస్తున్నారు. ఆ సచివాలయంలో వారంతా ఒకే నోటిఫికేషన్‌లో నియమితులయ్యారు. దీంతో వారి మధ్య సీనియారిటీ సమస్య కూడా లేదు. అయితే, బేగంకు కొన్నాళ్ల క్రితం డ్రాయింగ్ అండ్ డిస్‌బర్సింగ్ ఆఫీసర్ (డీడీవో)గా అదనపు బాధ్యతలు కేటాయించారు. డీడీవోగా సిబ్బంది జీతాల ఫైల్ సిద్ధం చేయడం ఆమె చేతిలోనే ఉంటుంది. ఈ నేపథ్యంలో తమను తీవ్ర వేధింపులకు గురి చేస్తున్నారని ఆ సచివాలయ సిబ్బంది రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లోని డీఎల్‌డీవో, వార్డు, గ్రామ సచివాలయాల ఇన్‌చార్జి వీణాదేవిని కలిసి తమ గోడును వెళ్లబోసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. మే నెల జీతాలు నేటికీ రాలేదని బేగం ఫైల్ సిద్ధం చేయకపోవడమే అందుకు కారణమని డీఎల్‌డీవో దృష్టికి తీసుకెళ్లారు. బేగం వైఖరి పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేసిన డీఎల్‌డీవో సిబ్బంది ఫిర్యాదుపై సానుకూలంగా స్పందించారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తక్షణ చర్యలకు సిఫారసు చేస్తామని హామీ ఇచ్చారు.

## గ్యాస్ లీకై పెళ్లింట్లో ప్రమాదం



**పెనుగొండ, (విశాఖ సమాచారమ్):–** పెళ్లింట్లో అకస్మాత్తుగా జరిగిన ఓ ప్రమాదంలో ఏడుగురు గాయాలపాలయ్యారు. వివరాల ప్రకారం చెరుకువాడ కొండపల్లి వారి వీధిలో ఇవ్వల నాగేశ్వరరావు కుమారుడు శ్రీనివాసరావు వివాహం జరగనుండడంతో బంధువులు, స్నేహితులు అందరూ వచ్చారు. మంగళవారం ఇంటిలో గ్యాస్ వెలిగించి వంట చేస్తుండగా ప్రమాదవ శాత్తు గ్యాస్ లీకై ఆకస్మాతుగా మంటలు వ్యాపించాయి. దీంతో అప్రమత్తమై మంటలు అదుపులోకి తీసుకు రావడానికి ప్రయత్నించడంతో పెండ్లి కుమారుడు శ్రీనివాసరావుతో పాటు, బంధువులు అయినపర్తి లక్ష్మీ, కవిటం నాగమణి, సూర్య హనుమంతరావు, సత్యవతి, నరసింహమూర్తి , మాచవరపు వీరేంద్ర గాయాలపాలయ్యారు. వీరికి కాళ్లు చేతులు, పొట్ట, వీపు మీద గాయాలయ్యాయి. క్షతగాత్రులను హుటాహుటిన పెనుగొండలోని ప్రభుత్వాసుపత్రికి తరలించడంతో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. పెళ్లింట్లో పెనుప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకొన్నారు.

## మార్పులపై దృష్టి సారించాలి

**అమలాపురం టౌన్, (విశాఖ సమాచారమ్):–** నూతన విద్యా సంవత్సరంలో అమలవుతున్న మార్పులపై ప్రత్యేక దృష్టి సారించి ఆ దిశగా బోధన చేయాలని డీఈవో డాక్టర్ షేక్ సలీమ్ బాషా ఉపాధ్యాయులకు సూచించారు. అమలాపురంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన జిల్లా రిసోర్స్ పర్సన్ల శిక్షణ కార్యక్రమంలో డీఈవో బాషా ప్రసంగించారు. జిల్లా విద్యా శాఖ, సమగ్ర శిక్ష సంయుక్త ఆధ్వర్యంలో సెకండరీ స్థాయి ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు నియమితులైన జిల్లా రిసోర్స్ పర్సన్లకు మూడు రోజులపాటు శిక్షణ ఇచ్చేందుకు ఈ పాఠశాలలో ఏర్పాట్లు చేసినట్లు డీఈవో బాషా తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని సమగ్ర శిక్ష అదనపు కో ఆర్డినేటర్ జి.మమ్మీ ప్రారంభించారని చెప్పారు. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఆన్సర్ బుక్స్, పరీక్షా విధానంలో చోటు చేసుకున్న మార్పులు, తరగతి గది బోధనలో వినియోగించే టీచ్ టూల్స్, అబ్జర్వేషన్ పద్ధతులు, నూతన అకడమిక్ క్యాలెండర్ తదితర అంశాలపై ఈ శిక్షణ ఉంటుందని డీఈవో స్పష్టం చేశారు.

## ప్లాస్టిక్ కాలుష్యాన్ని నిర్మూలిద్దాం



**విజయనగరం, (విశాఖ సమాచారమ్):-** ప్లాస్టిక్ కాలుష్యానికి ముగింపు పలకాల్సిన సమయం వచ్చిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అన్నారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని పూర్తిగా నిర్మూలించాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా కాలుష్య నియంత్రణా మండలి రూపొందించిన జ్యూట్ సంచుల పంపిణీని జిల్లా కలెక్టర్ అంబేద్కర్ బుధవారం ప్రారంభిచారు. ప్లాస్టిక్ సంచులు బదులుగా గుడ్డ సంచులు, జ్యూట్ సంచులను వాడాలని ఆయన సూచించారు.

ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మురళి, పర్యావరణ ఇంజనీర్ సరిత, జిల్లా అటవీశాఖాధికారి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

### 6 నుంచి మెగా డిఎస్సి
## పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

**హాల్ టిక్కెట్‌లో తప్పులుంటే సరిదిద్దుతాం : జిల్లా కలెక్టర్**



**విజయనగరం, (విశాఖ సమాచారమ్):-** ఈ నెల 6 నుంచి ప్రారంభమయ్యే మెగా డిఎస్సికి జిల్లాలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. డిఎస్సికి చేయాల్సిన ఏర్పాట్లపై తమ ఛాంబర్లో సంబంధిత అధికారులతో బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

జూన్ 6 నుంచి 30వ తేదీ వరకు డిఎస్సి పరీక్ష జరుగుతుందని కలెక్టర్ చెప్పారు. దీనికోసం సుమారు 36,495 మంది ధరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. సీతం కాలేజ్, ఐయాన్ డిజిటల్, లెండి ఇంజనీరింగ్, ఎంవిజిఆర్ ఇంజనీరింగ్, అవంతి కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆన్‌లైన్ విధానంలో ఉదయం 9.30 నుంచి 12 గంటలు వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటలు వరకు రెండు పూటలా పరీక్ష జరుగుతుందని చెప్పారు. అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి గంట ముందుగా హాజరుకావాలని, హాల్ టిక్కెట్‌తోపాటు తప్పనిసరిగా ఆధార్ లేదా ఏదైనా గుర్తింపు కార్డును తీసుకురావాలని సూచించారు.

పరీక్షా కేంద్రాలవద్ద పటిష్టబందోబస్తును ఏర్పాటు చేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతీ పరీక్షా కేంద్రానికి ఒక ఛీఫ్ సూపరింటిండెంట్, సిట్టింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని పరీక్షా పరీక్షా కేంద్రాలవద్ద వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని, త్రాగునీరు అందుబాటులో ఉంచాలని, నిరంతర విద్యుత్ సరఫరా, హైస్పీడ్ నెట్ సదుపాయం ఉండాలని ఆదేశించారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకొనేవిధంగా అదనపు బస్సులను నడపాలని ఆర్‌టిసికి సూచించారు.

**తప్పులు సరిదిద్దుకొనే అవకాశం ఉంది**

డిఎస్సి హాల్‌టిక్కెట్‌లో ఏమైనా తప్పులు నమోదై ఉంటే సరిదిద్దుకొనే అవకాశం ఉందని, వాటికోసం అభ్యర్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ సూచించారు. ఏదైతే తప్పు నమోదయ్యిందో, దానికి సంబంధించిన ఒరిజనల్ సర్టిఫికేట్ ను చూపించి, ధృవీకరించిన దాని జెరాక్స్ కాపీని అందజేసి, పరీక్షా కేంద్రంవద్దే సరిచేసుకోవచ్చునని చెప్పారు. తప్పులు సరిచేయించుకొనేవారు గంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని కలెక్టర్ సూచించారు.

ఈ సమావేశంలో డిఆర్ఓ మురళి, జిల్లా విద్యాశాఖాధికారి మాణిక్యంనాయుడు, ఎపిఈపిడిసిఎల్ ఎస్ఈ లక్ష్మణరావు, డిప్యుటీ డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ రాణి, జిల్లా ప్రజా రవాణా అధికారి సిహెచ్ అప్పలనారాయణ, సీఐ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

## యోగా వల్ల సంపూర్ణ ఆరోగ్యం

**మానసిక ప్రశాంతత**
**మండల ప్రత్యేక అధికారి వి. నాగ శిరీష**

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** ప్రతి రోజు యోగా చెయ్యడం వల్ల ఆరోగ్యంగా ఉంటామని అందువల్ల ప్రతి ఒక్కరూ విధిగా రోజు యోగ సాధన చేసినట్లయితే మనుషులు రోగాలు బారిన పడకుండా ఆరోగ్యాంగా, సంపూర్ణంగా, ప్రశాంతంగా జీవిస్తారని నాతవరం మండల ప్రత్యేక అధికారి మరియు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి వి నాగ శిరీష అన్నారు. యోగాంధ్ర -2025 కార్యక్రమంలో భాగంగా బుధవారం నాతవరం మండలం సరుగుడు గ్రామ పంచాయతీ రామన్నపాలెం గ్రామంలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల నందు జిల్లా ఆయుష్ శాఖ సహకారంతో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 300 మంది గిరిజనలతో యోగ ప్రదర్శన కార్యక్రమం నిర్వహించబడింది. యోగా గురువులు వై. సత్తిబాబు, ఏ.సోరోజినీ ల పర్యవేక్షణలో మండల ప్రత్యేక అధికారి నాగ శిరీష జిల్లా, ఎంపీడీఓ ఉషశ్రీ, ఆశ్రమ ప్రధానోపాధ్యాయులు దర్శి సత్యనారాయణ, ఆశ్రమ బరుల పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు జి సురేష్ కుమార్, పాఠశాల సిబ్బంది, సచివాలయ సిబ్బంది, గిరిజనలుతో యోగాసనలు వెయ్యడం జరిగింది.

యోగా ప్రదర్శన కార్యక్రమం లో ఎంపీపీ సాగిన లక్ష్మణ మూర్తి, నర్సీపట్నం ఆయుష్ వైద్య అధికారి డాక్టర్ బి యశోద, సరుగుడు, సుందర్ కోట సర్పంచులు జి గంగరాజు చిన్నతల్లి, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**విశాఖ సమాచారమ్‌లో**
**క్లాసిఫైడ్స్ ప్రకటనల కొరకు**
**సంప్రదించవలసిన**
**ఫోన్ నెం. 95535 74250**

# ప్రజా తీర్పు దినం



**అనంతగిరి, (విశాఖ సమాచారమ్):-** రాష్ట్రానికి దక్కిన మహర్దశకు ప్రతికంగా రంగవల్లులతో మన ముంగిళ్లను అలంకరించి సాయంత్రం దీపాలను వెలిగించి సంక్రాంతి- దీపావళి కలబోసిన గత పాలన వల్ల గాడి తప్పిన రాష్ట్రానికి విముక్తి రాజధాని లేని సమస్య అభివృద్ధి పదాన రాష్ట్రం సంక్షేమం అమల్లోకి వచ్చిన దినంగా ఎగువ శోభ పంచాయతీ హెక్టగుడ గ్రామంలో కూటమి పార్టీ మండల అధ్యక్షులు సోవేరి.సుబ్బారావు,చిట్టం.మురళి ఆధ్వర్యంలో బుధవారం నాడు వాడ వాడకు వీధి వీధిలకు మహిళలు ముగ్గులు వేసి పచ్చ తోరణాలతో కట్టి సంబరాలు జరుపుకున్నారు. తదనంతరం అధ్యక్షులు మాట్లాడుతూ యువత దగ్గర నుంచి మహిళల వరకు రైతుల దగ్గర నుంచి కులవృత్తిదారుల వరకు ఓసి, బీసీ, ఎస్సీ, ఎస్టి, మైనార్టీల దగ్గర నుంచి 5 కోట్ల ప్రజల వరకు విధ్వంసకరుడు వద్దు విజనరీ లీడర్ కూటమి పరిపాలన కావాలంటూ జగన్ అనే వెన్నుపోటుదారుడి పై జనం తిరుగుబాటే ఈ ప్రజా తీర్పు దినం అని ఒక ఛాన్స్ అంటూ ప్రజలను మభ్యపెట్టి అధికారం రాగానే వారిని ఘోరంగా మోసం చేసిన జగన్ ను ప్రజలు తమ ఓటుతో తరిమికొట్టిన రోజు అదేవిధంగా తమపై అపారమైన నమ్మకంతో చారిత్రాత్మక విజయాన్ని అందించిన ప్రజలకు వికసిత్ ఆంధ్ర సాధనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని వారన్నారు ఈ సందర్భంగా ముగ్గులు పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు వంజరపు శంకర్రావు,పాంగి బీమన్న,మండల క్లస్టర్ ఇంచార్జ్ యువ నాయకులు పాంగి. సందీప్ (బాబి), సిరికోడి. ధర్మ, జనసేన నాయకులు పాంగి లక్ష్మణ, కొర్ర. రవి, వీఆర్పీలు రాధా,నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

# వెన్నుపోటు దినం నిరసన ర్యాలీ





**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** ఈ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజలకు ఇచ్చిన హామీలు గాలికి వదిలేసి చంద్రబాబు చేసిన మోసాలు,అరాచకాలు, అన్యా యాలపై వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.యస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షులు కె.కె రాజు దక్షిణ, తూర్పు నియోజకవర్గం సమన్వయకర్తలు వాసుపల్లి గణేష్ కుమార్, మొల్లి అప్పారావు ఆధ్వర్యంలో వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు విశాఖపట్నం జిల్లా పరిషత్తు జంక్షన్ నుండి జిల్లా కలెక్టర్ల వారి కార్యాలయం కు బుధవారం ఉదయం వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ ఆనాడు ఎన్టీఆర్ ను వెన్నుపోటు పొడిచి దొడ్డిదారిలో ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు నాయుడు ఈరోజు ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి అధికారం చేపట్టి ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారని ఆయన ఆరోపించారు. అధికారం చేపట్టిన నాటి నుండి వైసీపీ నాయకులను, కార్యకర్తలను టార్గెట్ చేస్తూ అనేక రకాలుగా కేసులు బనాయించి అరాచక పాలన సాగిస్తూ సంవత్సరం గడిపేసారని, ప్రజల సంక్షేమం కోసం ఏనాడు పట్టించుకోవడం లేదని అన్నారు . వచ్చే ఎన్నికల్లో వీటి అన్నిటికీ తగిన మూల్యం చెల్లించుకోవలసి ఉంటుందని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు గొల్ల బాబు రావు,శాసనమండలి సభ్యురాలు మరియు వైఎస్ఆర్సిపి రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కళ్యాణి, మాజీఎమ్మెల్యేలు, సమన్వయకర్తల, కార్పొరేటర్లు, మాజీకార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు,సభ్యులు, రాష్ట్ర,పార్లమెంట్,సిటీ నాయకులు, మహిళా విభాగం నాయకులు,సీనియర్ నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# భీమిలి ఇండోర్ స్టేడియం అభివృద్ధి కృషి చేస్తా

**భీమిలి ప్రజలు బాధ్యత తీసుకోవాలి : భీమిలి నీడీ వెల్ఫేర్ సభ్యులతో గంటా**




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** భీమిలిలో క్రీడల అభివృద్ధే లక్ష్యంగా గంటా శ్రీనివాసరావు గతంలో భీమిలిలో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయడం జరిగిందని ఆ తరువాత దాని నిర్వహణ మీద దృష్టి సారించక పోవడంతో సమస్యలు పేరుకు పోవడం జరిగింది, క్రీడా ప్రాంగణానికి ఉండాల్సిన కనీస వసతులు కూడా కల్పించక పోవడంతో క్రీడాకారులు ఈ స్టేడియం ఉపయోగించుకునే పరిస్థితి లేదని స్టేడియం చుట్టూ వీధి దీపాలు లేకపోవడం తో పాటు రాత్రి పూట కాపలాదారు కూడా లేకపోవడంతో తాగుబోతులకు అడ్డాగా మారిందని, రాత్రిపూట మద్యం తాగేసి, ఆ సీసాలను ఇక్కడే బద్దలు కొట్టేసి పడేయడం లాంటివి జరుగుతున్నాయని వుడెన్ కోర్టు అందుబాటులోకి తెస్తే క్రీడాకారులకు మరింత ఉపయోగకరంగా ఉంటుందని భీమిలి నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు బుధవారం భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు, ఆయన తనయుడు గంటా రవితేజ దృష్టికి తీసుకువెళ్లారు.

ఇక్కడ సుమారు నలభై మంది పిల్లలు షటిల్ బ్యాడ్మింటన్ శిక్షణ తీసుకుంటుండగా, ఈ సంవత్సరం జాతీయ స్థాయి పోటీలకు ఎనిమిది మంది ఎన్నికయ్యారని. సరైన వసతులు కల్పిస్తే మరింత మంది శిక్షణకు వచ్చే అవకాశం ఉందని గంటా శ్రీనివాసరావుకు వివరించారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ ఇప్పటికే 2.5 కోట్ల రూపాయలు స్టేడియం అభివృద్ధికి మంజూరై ఉందని భీమిలి ప్రజలు స్టేడియం నిర్వహణ బాధ్యత తీసుకోవాలని, ఇండోర్ స్టేడియంలో మెరుగైన వసతులు కల్పించడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నీడీ వెల్ఫేర్ అధ్యక్షులు కైతపల్లి శ్రీనివాసరావు, సభ్యులు ముసునూరి సూర్య శ్రీనివాస్, కాళ్ళ సన్నీ, రాజేటి బసవ కృష్ణమూర్తి, కోచ్ ఫాల్గుణ, ఎద్దు ప్రతాప్, బైపిల్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో కేంద్ర జల శక్తి అభియాన్ బృందం పర్యటన

- మర్యాదపూర్వకంగా కలెక్టర్ ను కలిసిన బృంద సభ్యులు
- వెనుకబడిన జిల్లా , నిధుల మంజూరు చేయాలి : జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్. అంబేద్కర్



**విజయనగరం, (విశాఖ సమాచారమ్):-** జిల్లాలోని జలవనరుల పరిశీలించి క్షేత్ర స్థాయి లో పరిస్థితులను తెలుసుకోడానికి కేంద్ర జలశక్తి అభియాన్ బృందం బుధవారం జిల్లాలో పర్యటించింది. తొలుత జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ ను మర్యాదపూర్వకంగా కలిసి వారి పర్యటన వివరాలను తెలియజేసారు. జిల్లాలో తోటపల్లి, తారకరామా తీర్థసాగర్ ప్రాజెక్టులను సందర్శిస్తామని తెలిపారు. కోటగండ్రేడు లో జలజీవన్ మిషన్ లబ్దిదరులతో ముఖా ముఖి మాట్లాడతామని తెలిపారు.

ఈ బృందం లో మినిస్ట్రీ అఫ్ కామర్స్ డైరెక్టర్ తరుణా దోలియ, కేంద్ర వాటర్ కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ నిఖిల్ జేఫ్ , సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు శాస్త్రవేత్త డి. అనంతరావు ల తో పాటు ఆర్.డబ్ల్యు.ఎస్.ఎస్.ఈ కవిత, ప్రాజెక్ట్ డి.ఈ.ఈ. గోవింద రావు, తోటపల్లి ఎస్ ఈ స్వర్ణకుమార్ , ఈ ఈ అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

**వెనుకబడిన జిల్లా , నిధుల మంజూరు చేయాలి : జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్. అంబేద్కర్**

కలెక్టర్ ను కలిసిన కేంద్ర జలశక్తి అభియాన్ బృందం తో జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ మాట్లాడుతూ విజయనగరం వెనుకబడిన జిల్లా అని, కేంద్ర ప్రాజెక్టుల కోసం నిధులను కేటాయించాలను బృందాన్ని కోరారు. తారకరామా తీర్ధ సాగర్ పై బృందానికి వివరిస్తూ ఈ ప్రాజెక్టు కోసం 800 కోట్ల రూపాయలతో అంచనా ప్రతిపాదనలు పంపగా 100 కోట్లు మాత్రమే ఇప్పటివరకు మంజురైనాయని, ఆర్ అండ్ ఆర్ చెల్లింపులు పెండింగ్ ఉందని, మిగిలిన నిధులు మంజూరు చేస్తే అభివృద్ధి కి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ క్రింద 5 ఎం.ఎల్.డి నీరు భోగాపురం ఎయిర్పోర్ట్ కు సరఫరా చేయడానికి, విజయనగరం మున్సిపాలిటీ కి తాగు నీరు సరఫరాకు , 25 వేల ఎకరాలకు సాగు నీరందించడానికి ఉద్దేశించబడిందని తెలిపారు. అయితే నిధులు కేటాయింపు తోనే లక్ష్యాలను పూర్తి చేయగలమని తెలిపారు. అదే విధంగా జల జీవన్ మిషన్ క్రింద అదనపు నిదులు అవసరం అవుతుందని తెలిపారు. బృంద సభ్యులు స్పందిస్తూ అంచనాలతో ప్రతిపాదనలు ఇవ్వాలని , కేంద్ర ప్రభుత్వానికి పంపించి సిఫార్సు చేయడం జరుగుతుందని తెలిపారు.

## రైల్వే బ్రిడ్జిల పరిరక్షణకు చర్యలు




**రాజమహేంద్రవరం సిటీ, (విశాఖ సమాచారమ్):-** గోదావరి నదిపై గల ప్రతిష్టాత్మకమైన రోడ్ కమ్ రైల్వే బ్రిడ్జి, ఆర్చ్ బిడ్జిల పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు అడిషనల్ డివిజనల్ రైల్వే మేనేజర్ పీఈ ఎడ్విన్ పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలో గల రెండు బ్రిడ్జిలను అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైల్వే వంతెనలపై జరుగుతున్న మౌలిక సదుపాయాల అభివృద్ధి పనుల నాణ్యత, భద్రతా తనిఖీని నిర్వహించామన్నారు. 2027 నాటికి సురక్షితమైన, బలమైన వంతెనలుగా తీర్చిదిద్దడానికి, రూ.115 కోట్ల మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రోడ్ కమ్ రైల్ బ్రిడ్జ్ పై సురక్షితమైన ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఐకానిక్ ఆర్చ్ బ్రిడ్జ్‌పై రూ.70 కోట్లతో కేబుల్ రీ ప్లేస్మెంట్ వర్క్ పూర్తి చేస్తున్నామన్నారు. భారతీయ రైల్వేలతో అవగాహన ఒప్పందం కింద రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధుల మద్దతును ఆశిస్తున్నామన్నారు. పలువురు రైల్వే అధికారులు పాల్గొన్నారు.

## స్కూటీపై వెళ్తూంటే.. చైన్ లాక్కుపోయారు

**కరప, (విశాఖ సమాచారమ్):-** గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు మోటార్ సైకిల్‌పై వెంబడించి, విధులు ముగించుకుని స్కూటీపై ఇంటికి తిరిగి వెళ్తున్న మహిళా ఉద్యోగి మెడలోని బంగారు గొలుసు లాక్కుని పోయారు. పోలీసుల కథనం ప్రకారం.. కాజులూరు మండలం గొల్లపాలెం గ్రామానికి చెందిన కొండేపూడి శాంతి శివకుమారి కరప మండలం వేళంగిలోని ఎస్‌బీఐ బ్రాంచిలో టెంపరరీ వర్కర్‌గా పని చేస్తున్నారు. ఆమె సోమవారం సాయంత్రం తన స్కూటీపై గొల్లపాలెం వెళ్తూండగా సిరిగలపల్లిలంక గ్రామం దాటిన తర్వాత దుండగులు ఈ ఘాతుకానికి ఒడిగట్టి, వేగంగా పరారయ్యారు. బాధితురాలు మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరప పోలీసులు కేసు నమోదు చేశారు. కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ పర్యవేక్షణలో కరప ఎస్సై టి.సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## స్థల పరిశీలన చేసిన జెసి సేతు మాధవన్



**గంట్యాడ, ఎస్.కోట, (విజయనగరం), (విశాఖ సమాచారమ్):-** యోగాంధ్ర రాష్ట్రస్థాయి కార్యక్రమం కోసం ఎస్.కోట, గంట్యాడ మండలాల్లో పలు ప్రదేశాలను జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ పరిశీలించారు. ఈ నెల 10న సుమారు 5వేల మంది ఉపాధి వేతనదారులతో రాష్ట్రస్థాయి యోగా కార్యక్రమం ఎస్.కోటలో జరగనుంది. ఈ కార్యక్రమం కోసం పలు ప్రదేశాలను ఆయన బుధవారం పరిశీలించారు. అదేవిధంగా ప్రముఖ పర్యాటక ప్రదేశం తాటిపూడి వద్ద ఈనెల 19న యోగా కార్యక్రమం జరగనుంది. దీనికోసం కూడా తాటిపూడి ప్రాంతాన్ని పరిశీలించారు. జెసి వెంట డిఆర్డిఏ పిడి ఎ.కల్యాణచక్రవర్తి, జిల్లా పర్యాటక శాఖాధికారి కుమారస్వామి, ఎస్‌కోట తాహసీల్దార్ అరుణకుమారి, గంట్యాడ ఇన్‌ఛార్జి తాహసీల్దార్ వివివి మూర్తి, ఇతర సిబ్బంది ఉన్నారు.

**రేషన్ షాపు తనిఖీ**

తాటిపూటి రేషన్ షాపును జెసి సేతు మాధవన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. షాపులో సరుకుల నిల్వలను, రికార్డులను పరిశీలించారు. ప్రజలకు సకాలంలో సరుకులను అందించాలని, షాపులకు రాలేనివారి ఇళ్లవద్దకే సరుకులను సరఫరా చేయాలని జెసి ఆదేశించారు.

## చరిత్రలో ఈ రోజు (జూన్ 5)

**సంఘటనలు:**

1968: అమెరికా సెనేటరు రాబర్ట్ ఎఫ్. కెన్నడీపై సిర్హాన్ సిర్హాన్ అనే వ్యక్తి కాల్పులు జరిపాడు. ఈ సంఘటన లాస్ ఆంజిల్స్‌లోని ది అంబాసిడర్ హోటల్లోని వంటశాలలో జరిగింది.

1972: స్వీడన్ రాజధాని స్టాక్‌హోంలో మొట్టమొదటి పర్యావరణ సదస్సు నిర్వహణ.

1995: “బోస్-ఐన్‌స్టీన్ కండెన్సేట్”ను మొదటి సారి సృష్టించారు.

2008: 3000 మీటర్ల పరుగులో సురేంద్రసింగ్ భారత జాతీయ రికార్డు సృష్టించాడు. 16 సంవత్సరాల బహదూర్ ప్రసాద్ రికార్డు ఛేదించారు.

**జననాలు:**

1908: రావి నారాయణరెడ్డి, కమ్యూనిస్టు నాయకుడు, తెలంగాణ పోరాటంలో ముఖ్యుడు.

1934: చెన్నుపాటి విద్య, భారత పార్లమెంటు సభ్యురాలు, సంఘ సేవిక.

1941: ఆచార్య ఎస్వీ రామారావు, పి.హెచ్.డి. పరిశోధనా పర్యవేక్షకుడిగా కూడా మంచి పేరు సంపాదించుకున్నాడు. ఇతని పర్యవేక్షణలో 19 పి.హెచ్.డి పరిశోధనలు, 15 ఎం.ఫిల్ పరిశోధనలు జరిగాయి.

1956: కుట్టి పద్మిని, దక్షిణ భారత చలనచిత్ర నటి, నిర్మాత.

1961: రమేశ్ కృష్ణన్, భారత టెన్నిస్ క్రీడాకారుడు.

1974: భాస్కర భట్ల రవికుమార్, సినీ గీత రచయిత.

1976: రంభ, తెలుగు సినిమా నటి.

1993: సురభి , తెలుగు తమిళ చిత్రాలనటి

**మరణాలు:**

1973: మాధవ్ సదాశివ్ గోల్వాల్కర్, గురూజీగా ప్రసిద్ధి చెందిన హిందుత్వ నాయకుడు

1996: ఆచార్య కుబేర్‌నాథ్ రాయ్, భారతీయ రచయిత, జ్ఞానపీఠ పురస్కర గ్రహీత

2nd pages.qxd 6/4/2025 8:15 PM Page 8



# క్రీడా సమాచారమ్

## ఆర్సీబీకి రూ.20 కోట్లు, పంజాబ్ కింగ్స్‌కు రూ.12.5 కోట్లు



**ఇంటర్నెట్ డెస్క్:** ఐపీఎల్ 2025 ట్రోఫీని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కైవసం చేసుకుంది. ఈ నేపథ్యంలో ప్రైజ్ మనీగా 20 కోట్ల రూపాయలను సొంతం చేసుకుంది. రన్నరప్‌గా నిలిచిన పంజాబ్ కింగ్స్ 12.5 కోట్ల రూపాయలు పొందింది. ఆర్సీబీకి ఇదే తొలి ఐపీఎల్ టైటిల్ కావడం గమనార్హం. గతంలో ఈ టీమ్ 2009, 2011, 2016లో ఫైనల్స్‌కు చేరుకుంది. కానీ చివర్లో బోల్తా పడింది. 18 ఏళ్ల నిరీక్షణకు తెర దించుతూ.. బెంగళూరు జట్టు ఐపీఎల్ 2025 ట్రోఫీని కైవసం చేసుకుంది. క్వాలిఫయర్ -2లో ఓడిపోయి, మూడో స్థానంలో నిలిచిన ముంబయి ఇండియన్స్ జట్టుకు రూ.7 కోట్లు దక్కాయి. ఎలిమినేటర్‌లో పరాజయం పాలై, నాలుగో స్థానానికి పరిమితమైన గుజరాత్ టైటాన్స్ రూ.6.5 కోట్లు తమ ఖాతాలో వేసుకుంది. ఐపీఎల్ ప్రారంభమైనప్పుడు 2008 సీజన్‌లో ప్రైజ్‌మనీ రూ.4.8 కోట్లుగా ఉండేది. రన్నరప్‌నకు 2.4 కోట్లు దక్కేవి. అప్పటి నుంచి క్రమంగా ప్రైజ్‌మనీ పెరుగుతూ వస్తోంది.

**ఢిల్లీ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్‌కూ అవార్డు**

'బెస్ట్ పిచ్ అండ్ గ్రౌండ్' అవార్డును ఢిల్లీ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ సొంతం చేసుకుంది. డీడీసీఏ రూ.50 లక్షలు గెలుచుకుంది. ఈ సీజన్‌లో అరుణ్‌జైట్లీ స్టేడియంలో ఏడు ఐపీఎల్ మ్యాచ్‌లు జరిగాయి. 'ఈ అవార్డు మా క్యూరేటర్లు, సిబ్బంది, యాజమాన్యం అవిశ్రాంత కృషికి నిదర్శనం. క్రికెట్ మౌలిక సదుపాయాల్లో అత్యున్నత ప్రమాణాలు కొనసాగించడానికి మేము కట్టుబడి ఉన్నాం' అని డీడీసీఏ అధ్యక్షుడు రోహన్ జైట్లీ ఈ సందర్భంగా అన్నాడు.

**ఎవరెవరు.. ఎంత గెలుచుకున్నారంటే..**

అత్యధిక పరుగుల వీరుడిగా ఆరెంజ్ క్యాప్‌ను సొంతం చేసుకున్న గుజరాత్ టైటాన్స్ ఆటగాడు సాయిసుదర్శన్ (759 రన్స్), అత్యధిక వికెట్ల వీరుడిగా నిలిచి, పర్పుల్ క్యాప్ సాధించిన ప్రసిద్ధ్‌కృష్ణ (25 వికెట్లు) చెరో రూ.10 లక్షలు గెలుచుకున్నారు. ఎమర్జింగ్ ప్లేయర్‌గా సాయి సుదర్శన్ మరో రూ.10 లక్షలు, మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్‌గా సూర్యకుమార్ యాదవ్ రూ.15లక్షలు, సూపర్ స్ట్రైకర్ ఆఫ్ ది సీజన్‌గా నిలిచిన వైభవ్ సూర్యవంశీ రూ.10 లక్షలతో పాటు, కారు, బెస్ట్ క్యాచ్ విన్నర్‌గా నిలిచిన కమిందు మెండిస్ రూ.10 లక్షలు, మోస్ట్ డాట్‌బాల్స్ సంధించిన మహ్మద్ సిరాజ్ రూ.10 లక్షలు గెలుచుకున్నారు. ఫెయిర్ ప్లే అవార్డును చెన్నై సూపర్ కింగ్స్ (రూ.10 లక్షలు) సొంతం చేసుకుంది.

## పెట్టని కోటలా.. ఆర్సీబీ ఆర్మీ




**ఇంటర్నెట్‌డెస్క్:** ఐపీఎల్‌లో ఆర్సీబీ ఎన్ని ఓటములు చవిచూసినా.. ఫ్యాన్స్ మాత్రం జట్టు చేయి వదిలిపెట్టలేదు. మీ వెంట మేమున్నాం అంటూ ప్రతి మ్యాచ్‌లో జట్టును ఉత్సాహపర్చారు. 'ఈ సలా కప్ నమదే '.. ఐపీఎల్ సీజన్ వచ్చిందంటే చాలు ఆర్సీబీ (రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు) ఫ్యాన్స్ ఈ నినాదంతో చేసే సందడితో ఇంటర్నెట్ హోరెత్తిపోతుంది. దాదాపు 17 సీజన్లుగా .. ఏటా తమ జట్టు విజయం సాధించాలని నిర్విరామంగా ఉత్సాహపర్చారు. ఈ క్రమంలో లెక్కలేనన్నిసార్లు వారి హృదయాలు బద్దలయ్యాయి. కానీ, ఏ దశలోనూ వారు జట్టును వీడలేదు. దృఢంగా..భావోద్వేగాలతో.. ఆశావాదంతో కష్టకాలంలోను జట్టును అంటిపెట్టుకొని ఆటగాళ్లలో జోష్ నింపారు. ఆర్సీబీకి 12%వ్య% మెన్ ఆర్మీగా నిలిచారు. ఐపీఎల్‌లో అత్యధిక ఫాలోయింగ్ ఉన్న జట్లలో ఒకటిగా నిలిచింది. దీంతో వీరి ఆశలు ఫలించి 18వ సీజన్‌లో 'ఈ సలా కప్ నమదు'గా మారింది.


2008లో యునైటెడ్ స్పిరిట్స్ యాజమాన్యంలో ఈ జట్టు ఏర్పడింది. దీనిలో ఈ జట్టుతో కలిసి అనిల్ కుంబ్లే, విరాట్, ఏబీ డివిలియర్స్, గేల్, డూప్లిసెస్ ఆడారు. అయినా, ఒక్క ఐపీఎల్ టైటిల్ సాధించలేదు. 2009, 2011, 2016 ఫైనల్స్‌కు చేరినా.. అదృష్టం వెక్కిరించింది. కానీ, జట్టు ఫ్యాన్స్‌ను కలిపి ఉంచిన నినాదం 'ఈ సలా కప్ నమదే'. ప్రత్యర్థి జట్ల ఫ్యాన్స్‌కు ఇది మీమ్ మెటీరియల్‌గా మారినా అభిమానుల ఆశలు చెక్కుచెదరలేదు. బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునాక్ ఆర్సీబీకి పెద్ద ఫ్యాన్. తమ అభిమాన జట్టు ఫైనల్స్‌కు చేరడంతో.. ఈ బెంగళూరు అల్లుడు లండన్ నుంచి సతీసమేతంగా రెక్కలు కట్టుకొని భారత్‌లో వాలిపోయారు.

**ఫ్యాన్స్ అభిమానానికి స్టార్లు ఫిదా..!**

ఈ జట్టు ఫ్యాన్స్ అభిమానానికి పెద్దపెద్ద క్రికెట్ స్టార్లు ఫిదా అయిపోయారు. క్రిస్ గేల్ ఆర్సీబీ తరఫున విధ్వంసం సృష్టించాడు. ఈ జట్టు తరఫున ఐపీఎల్‌లో అత్యధిక స్కోర్ (175) సాధించాడు. రిటైర్మెంట్ తరవాత కూడా ఆర్సీబీ తరఫునే ఎక్కువగా మైదానంలో కనిపిస్తుంటాడు. ఇక మిస్టర్ 360 ఏబీ డివిలియర్స్ మద్దతుదారుగా కొనసాగుతున్నాడు. ఇక విరాట్ సంగతి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తన ఐపీఎల్ కెరీర్‌ను ఈ జట్టులోనే ప్రారంభించి.. ఇప్పటికీ కొనసాగుతున్నాడు. "18 ఏళ్లుగా నా సర్వస్వం జట్టుకు ధారపోశాను. టీమ్‌పై పూర్తి విశ్వాసంతో కొనసాగాను. ప్రతి దశలో పరస్పరం ప్రోత్సహించుకొంటూ ముందుకునడిచాం. ఈ విజయం నా కల. నా హృదయం బెంగళూరుకు సొంతం. నేను చివరివరకు ఆర్సీబీకే ఆడతాను. ఈ రోజు రాత్రి పసిబిడ్డలా నిద్రపోతా" అంటూ భావోద్వేగానికి గురయ్యాడు. జట్టుకు లాయల్టీ విషయంలో ఫ్యాన్స్ తమ హీరో కోహ్లినే ఫాలో అవుతున్నారు. వాస్తవానికి భారత క్రికెట్‌లో విరాట్‌కు ఉన్న ఫ్యాన్ బేస్ మరే ఆటగాడికి లేదు. వారిలో చాలామంది ఆర్సీబీకి వీరవిధేయులు.

## ఈ ట్రోఫీకి అందరికంటే ఎక్కువ అర్హుడు కోహ్లినే

### -రజత్ పటీదార్



**ఇంటర్నెట్ డెస్క్:** 18 ఏళ్ల నిరీక్షణ అనంతరం ఐపీఎల్ ఛాంపియన్‌గా నిలిచింది రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు . ఈసారి కొత్త కెప్టెన్‌గా వచ్చిన రజత్ పటీదార్.. ఆ జట్టు చిరకాల స్వప్నాన్ని సాకారం చేశాడు. దీంతో ఆర్సీబీ అభిమానులు సంబరాల్లో మునిగి తేలుతున్నారు.

ఇక జట్టు విజయంపై రజత్ పటీదార్ మాట్లాడుతూ.. విరాట్ కోహ్లీ ని ఆకాశానికెత్తాడు. ఇది తనకు లభించిన గొప్ప అవకాశమని పేర్కొన్నాడు. "విరాట్ కోహ్లీ నుంచి నేర్చుకోవడానికి ఇది నాకు లభించిన గొప్ప అవకాశం. ఐపీఎల్‌లో ఈ ట్రోఫీని పొందడానికి ఇతరుల కంటే ఎక్కువగా విరాట్ కోహ్లీ అర్హుడు. ఎందుకంటే 18 సీజన్లుగా ఒకే ఫ్రాంచైజీకి అతడు ఆడుతున్నాడు" అని పటీదార్ అన్నాడు.

"ఈ విజయం నాకు, విరాట్ కోహ్లికి, మా జట్టు అభిమానులకు నిజంగా ఎంతో ప్రత్యేకం. అభిమానులు మాకు సంవత్సరాలుగా మద్దతు ఇస్తున్నారు. ఇక స్లో పిచ్‌పై 190 పరుగులు కూడా మంచి స్కోరే. ఓ సమయంలో ఈ పిచ్‌పై మా బ్యాటర్లు పరుగులు త్వరగా ఎందుకు చేయడం లేదన్న ప్రశ్నలు వచ్చాయి. అయితే.. ఆ తర్వాత పంజాబ్ కూడా ఈ పిచ్‌పై ఇబ్బంది పడింది. మా బౌలర్లు జట్టు ప్రణాళికలను చక్కగా అమలు చేశారు" అని పటీదార్ తెలిపాడు. ఇక రెండు వికెట్లు తీసి పంజాబ్‌ను నిలువరించిన ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కృనాల్ పాండ్య బౌలింగ్‌పై కూడా పటీదార్ ప్రశంసల వర్షం కురిపించాడు.

## ఛాంపియన్‌గా ఆర్సీబీ.. వీళ్లనూ మర్చిపోకూడదు



**ఇంటర్నెట్ డెస్క్:** సుదీర్ఘ నిరీక్షణ అనంతరం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఐపీఎల్ టైటిల్ విజేతగా నిలిచింది. రజత్ పటీదార్ నేతృత్వంలోని ఆ జట్టు ) తొలిసారిగా ఐపీఎల్ కప్‌ను ముద్దాడింది. ఇక ఆర్సీబీ విజయమనగానే మనకు విరాట్ కోహ్లీ నే గుర్తుకువస్తాడు. అంతగా ఆ జట్టును ప్రభావితం చేశాడు అతడు. అయితే.. విరాట్‌తోపాటు ఈ విజయంలో కీలకంగా నిలిచిన పలువురు ఆటగాళ్లూ ఉన్నారు.

**తొలిసారిగా ఆర్సీబీకి..**

బెంగళూరు విజయాల్లో కృనాల్ పాండ్య అద్భుత ప్రదర్శనను మరువలేం. తొలిసారిగా ఆర్సీబీకి ఆడుతున్న ఈ ఆల్‌రౌండర్.. జట్టులో కీలకంగా నిలిచాడు. ఇక ఫైనల్‌లో పంజాబ్ విజయం దిశగా వెళ్తున్న సమయంలో.. ఆ జట్టుకు పగ్గాలు వేసి నిలువరించాడు. అద్భుతంగా బౌలింగ్ చేసి రెండు కీలక వికెట్లు పడగొట్టడమే కాకుండా, పరుగుల ప్రవాహాన్ని అడ్డుకొని పంజాబ్‌ను దెబ్బతీశాడు. ఇక లీగ్ దశలో ఢిల్లీతో జరిగిన మ్యాచ్‌లో 73లి పరుగులతో అజేయంగా నిలిచి జట్టును గెలిపించాడు. ఇక బంతితోనూ రాణించి ఈ సీజన్‌లో 17 వికెట్లు పడగొట్టాడు.

**ఓపెనర్‌గా కీలకంగా నిలిచి..**

గత సీజన్ వరకూ కోల్‌కతాకు ఆడిన ఫిల్ సాల్ట్.. ఈసారి వేలంలో బెంగళూరుకు మారాడు. ఓపెనింగ్ బ్యాటర్‌గా వచ్చి అద్భుతంగా రాణించాడు. కోహ్లితో కలిసి విలువైన భాగస్వామ్యాలు నెలకొల్పాడు. మొత్తం 13 ఇన్నింగ్స్‌ల్లో 403 పరుగులు చేశాడు. గాయంతో రెండు మ్యాచ్‌లకు దూరమయ్యాడు.

**ఫినిషర్‌గా జితేశ్ శర్మ..**

వికెట్ల వెనక ఉన్న జితేశ్ శర్మ జట్టులో ఫినిషర్ పాత్రను అద్భుతంగా పోషించాడు. రజత్ పటీదార్ అందుబాటులో లేని సమయంలో రెండు మ్యాచ్‌లకు కెప్టెన్‌గానూ వ్యవహరించాడు. లఖ్‌నవూపై కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడి 85 పరుగులతో అజేయంగా నిలిచి జట్టును గెలిపించాడు.

**హేజిల్‌వుడ్.. ఎంత చెప్పినా తక్కువే**

ఈసారి ఆర్సీబీ బౌలింగ్ అంత పటిష్ఠంగా ఉందంటే అందుకు కారణం హేజిల్‌వుడ్. ప్రత్యర్థులను నిలువరిస్తూ.. ఈ సీజన్‌లో మొత్తం 22 వికెట్లు పడగొట్టి పర్పుల్ క్యాప్ రేసులో మూడో బౌలర్‌గా నిలిచాడు.

వీరితోపాటు భువనేశ్వర్ కుమార్ (17 వికెట్లు), యశ్ దయాల్ (13 వికెట్లు), సుయాశ్ శర్మ(8 వికెట్లు) కూడా రాణించారు. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్.. అన్ని విభాగాల్లో అద్భుత ప్రదర్శనతో ఈసారి ఆర్సీబీ కప్‌ను ముద్దాడింది. తమ అభిమానుల కలను నెరవేర్చి వారిలో జోష్ నింపింది.

## తుదిమెట్టుపై బోల్తా.. అయినా, ఆ జట్టు ఆటతీరు అద్భుతమే



**ఇంటర్నెట్ డెస్క్:** ఎలాంటి అంచనాలు లేని జట్టు అది.. ఈ ఐపీఎల్ సీజన్ లో అద్భుతంగా రాణించింది. అందరి అంచనాలు తలకిందులు చేస్తూ టేబుల్ టాపర్‌గానూ నిలిచింది. అయితే, చివరి మెట్టుపై బోల్తా పడింది. ఫైనల్‌లో ఓడినప్పటికీ.. ఆ జట్టు ఆటతీరును తక్కువ చేయలేం. ఆ జట్టే పంజాబ్ కింగ్స్ .

ఈ ఐపీఎల్ సీజన్‌కు ముందు పంజాబ్.. ఫైనల్ వరకూ వస్తుందని ఎవరైనా ఊహించారా..? పేలవ ప్రదర్శనతో ఎప్పుడూ ప్లేఆఫ్స్ వరకు రాకుండానే వెనుదిరిగి అభిమానుల్లో నిరాశ నింపుతుండేది. కానీ, ఈసారి కొత్త సారథి శ్రేయస్ అయ్యర్ ఆ జట్టు తలరాతనే మార్చేశాడు. టీమ్‌ను తనదైనశైలిలో నడిపిస్తూ.. కెప్టెన్‌గానే కాకుండా బ్యాట్‌తోనూ రాణించాడు. 11 ఏళ్ల తర్వాత జట్టును ప్లేఆఫ్స్‌నకు చేర్చాడు. దీంతో పంజాబ్ కింగ్స్ జట్టు గురించి మాట్లాడుకోవాలంటే.. శ్రేయస్ అయ్యర్‌కు ముందు.. ఆ తర్వాత అన్నంతగా మారింది.

**ఒత్తిడి తట్టుకోలేక..**

బెంగళూరుపై ఫైనల్‌లో పంజాబ్ 6 పరుగుల తేడాతో ఓడిపోయింది. ఛేదనలో ఆ జట్టు ఒత్తిడిని తట్టుకోలేకపోయింది. ఆర్సీబీ నిర్దేశించిన 190 పరుగుల లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. ప్రత్యర్థి బౌలర్ల ముందు నిలవలేకపోయింది. సూపర్ ఫామ్‌లో ఉన్న కెప్టెన్ శ్రేయస్, ఇంగ్లిస్ వికెట్లు సహా మూడు వికెట్లు 26 పరుగుల వ్యవధిలోనే కోల్పోయి పంజాబ్ ఓటమి దిశగా సాగింది. అద్భుతంగా బౌలింగ్ చేసిన కృనాల్ రెండు కీలక వికెట్లు పడగొట్టడమే కాకుండా, పరుగుల ప్రవాహాన్ని అడ్డుకొని పంజాబ్‌ను దెబ్బతీశాడు.

## అమ్మాయిలకు ఓ నమ్మకాన్నిచ్చే దేవిక అండ్ డానీ






"చాలా మంది అమ్మాయిలను చుట్టు పక్కల ఉండేవాళ్లు 'నువ్వు చేయలేవు.. సాధించలేవ'ని చెప్పి నిరుత్సాహపరుస్తుంటారు. అలాంటి అమ్మాయిలకు ఈ 'దేవిక అండ్ డానీ' వెబ్‌సిరీస్ ఓ నమ్మకాన్ని ఇస్తుంది" అన్నారు నటి రీతూ వర్మ. ఇది ఆమె నటించిన తొలి వెబ్‌సిరీస్. 'శ్రీకారం' విజయంతో తొలి అడుగులోనే ప్రేక్షకుల్ని మెప్పించిన బి.కిశోర్ దీన్ని రూపొందించారు. సుధాకర్ చాగంటి నిర్మాత. సూర్య వశిష్ఠ, శివ కందుకూరి, సుబ్బరాజు తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ వెబ్‌సిరీస్ ఈ నెల 6న ప్రముఖ ఓటీటీ వేదిక జియో హాట్‌స్టార్‌లో విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రీతూ వర్మ మాట్లాడుతూ.. "వైవిధ్యభరితమైన కాన్సెప్ట్‌లు వస్తే వెబ్‌సిరీస్ చేయాలని నేనెప్పటి నుంచో అనుకుంటున్నా. ఈ క్రమంలోనే 'దేవిక అండ్ డానీ' లాంటి నిజాయతీతో కూడిన కథ నా దగ్గరకొచ్చింది. ఇందులో నటించడం నా అదృష్టంగా భావిస్తున్నా. దర్శకుడు కిశోర్ దీన్ని అద్భుతంగా తెరకెక్కించారు" అంది. "సాధారణంగా ఊర్లలో ఉండే అమ్మాయిల్ని.. 'ఈ పని చేయి, ఆ పని చేయక'ని ఆంక్షలు పెడుతుంటారు. అలాంటి వాళ్లు బయటకు వెళ్తే ఎలా మారతారనే విషయాన్ని ఈ సిరీస్‌లో చక్కగా చూపించార"న్నారు నటుడు సూర్య వశిష్ఠ. దర్శకుడు బి.కిశోర్ మాట్లాడుతూ.. "'శ్రీకారం' తర్వాత ఈ సిరీస్ చేయడం చాలా ఆనందంగా ఉంది. దీన్ని చూసే ప్రేక్షకుల సమయం అసలు వృథా కాదు. ఇది ఆద్యంతం ప్రేక్షకుల్ని అలరిస్తుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో శివ కందుకూరి, సుధాకర్, మౌనిక, నందిని, జై క్రిష్ తదితరులు పాల్గొన్నారు.

## త్వరలోనే ఉస్తాద్ సెట్లోకి




కథానాయకుడు పవన్ కల్యాణ్ తన సినిమా చిత్రీకరణల్ని చకచకా పరుగులు పెట్టిస్తున్నారు. ఇప్పటికే 'హరి హర వీరమల్లు'ను పూర్తి చేసి విడుదలకు సిద్ధం చేసిన ఆయన ప్రస్తుతం 'ఓజీ'ని పూర్తి చేసే పనిలో పడ్డారు. కాగా, ఇప్పుడు తన మరో సినిమా 'ఉస్తాద్ భగత్ సింగ్'ను పునః ప్రారంభించేందుకు సమాయత్తమవుతున్నారు. హరీశ్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. శ్రీలీల కథానాయిక. అశుతోశ్ రాణా, నవాబ్ షా, గౌతమి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా ఈ నెల రెండో వారం నుంచి తిరిగి పట్టాలెక్కనుంది. ఈ విషయాన్ని చిత్ర దర్శకుడు హరీశ్ శంకర్ మంగళవారం తిరుపతిలో వెల్లడించారు. ఈ షెడ్యూల్ మొదలైన కొద్దిరోజుల్లోనే పవన్ కూడా ఈ చిత్ర సెట్లోకి అడుగు పెడతారని తెలిసింది. ఇది అన్ని రకాల వాణిజ్య హంగులతో మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా సిద్ధమవుతోంది. పవన్ ఇందులో పవర్‌ఫుల్ పోలీసు పాత్రలో అలరించనున్నారు. దీనికి దేవిశ్రీ ప్రసాద్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

## ట్రంప్ మనవరాలిని పెళ్లి చేసుకునేందుకే గోడ దూకా



**ఇంటర్నెట్‌డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నివాసం మార్ ఎ లాగో గోడ దూకేందుకు యత్నించిన ఓ యువకుడిని అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ట్రంప్ మనవరాలు కై ట్రంప్ ను పెళ్లి చేసుకోవాలనుకుంటున్నానని అతడు విచారణలో పేర్కొన్నాడు.

అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంథోనీ థామస్ (23) అనే వ్యక్తి మంగళవారం ట్రంప్ ఇంటి గోడ దూకేందుకు యత్నించాడు. వెంటనే గమనించిన అధికారులు అతడ్ని అదుపులోకి తీసుకున్నారు. విచారణ సమయంలో అతడు చెప్పిన సమాధానం విని అధికారులు ఆశ్చర్యపోయారు. 'ట్రంప్‌నకు ఒక శుభవార్త చెప్పడానికి వెళ్లాను. ఆయన మనవరాలు కై ట్రంప్‌ను పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను' అని థామస్ పేర్కొన్నాడు. కాగా.. థామస్ గోడ దూకడం ఇది రెండోసారని అధికారులు గుర్తించారు. గతేడాది డిసెంబరులోనూ ఇలాంటి ఘటనే చోటుచేసుకున్నట్లు తెలిపారు. తాజా ఘటన సమయంలో ట్రంప్ వాషింగ్టన్‌లో ఉన్నారని, దీనిపై ఆయనకు సమాచారం అందించామని వైట్‌హౌస్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం థామస్‌ను పామ్‌బీచ్‌లోని జైలుకి తరలించారు.

మార్ ఎ లాగో అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య ఉంటుంది. ఇక్కడికి సందర్శకులను, అతిథులను ఎవ్వరినీ లోపలికి రానివ్వరు. గతంలో ట్రంప్‌పై హత్యాయత్న ప్రయత్నాలు జరిగిన నేపథ్యంలో అధికారులు ఈ ప్రాంతంలో భద్రతను భారీగా పెంచారు. అయినప్పటికీ.. ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం గమనార్హం.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press
Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123, vspnews4@gmail.com